# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 233, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు ( 9491020055) బుధవారం - 06 - నవంబర్ - 2024


## మహారాష్ట్ర ఎన్నికలకు ముందు శరద్ పవార్ అనూహ్య ప్రకటన



భవిష్యత్తులో ఎలాంటి ఎన్నికల్లో పోటీ చేయబోనని ప్రకటించిన రాజకీయ దిగ్గజం

రాజ్యసభ ఎంపీ పదవీకాలం ముగిసిన తర్వాత పోటీకి దూరంగా ఉంటానని వెల్లడి

ప్రజలకు సేవ చేయడం మాత్రం ఆపబోనున్న రాజకీయ కురువృద్ధుడు

2

## ప్రైవేట్ ఆస్తుల స్వాధీనం కుదరదు..!
## చారిత్రాత్మక తీర్పును వెల్లడించిన 'సుప్రీం'...




ఢిల్లీ : ప్రైవేటు ఆస్తుల స్వాధీనం విషయంలో సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రైవేటు యాజమాన్యంలో ఉన్న అన్ని ఆస్తులను ఉమ్మడి ప్రయోజనం కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు వీలులేదని సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. 8:1 మెజారిటీతో సుప్రీంకోర్టు ఈ తీర్పును ఇచ్చింది. మిగతా..2లో

## అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారు?



ఇవాళ ఎన్నికలు ముగిసిన కొన్ని గంటలకే ఫలితాలు వచ్చే అవకాశం

ఇంతకుముందు కొన్ని సందర్భాలలో జరిగినట్టుగా ఒక నెల, వారాలు పట్టే అవకాశం

2020 ఎన్నికల ఫలితాలు తేలడానికి వారం రోజులు పట్టిన వైనం

2016లో మాత్రం తర్వాతి రోజే ఫలితం

2000 ఎన్నికల ఫలితాలకు ఏకంగా నెల రోజులు పట్టిన వైనం

ఢిల్లీ : అమెరికా అధ్యక్ష ఎన్నికలకు ఈరోజు ఎన్నికలు జరుగుతున్నాయి. ఇక ఈ ఎన్నికల ఫలితాలు మంగళవారం పోలింగ్ ముగిసిన కొన్ని గంటలకే, బుధవారం ఉదయం నుంచే తెలిసే అవకాశం ఉంది.

2

## ఏపీ ఎమ్మెల్సీ ఉపాధ్యాయ నియోజకవర్గాల పరిధిపై స్పష్టత నిచ్చిన ఈసీ




2

- ఏపీలో ఉపాధ్యాయ నియోజకవర్గాల పరిధికి సంబంధించి వివరాలు వెల్లడించిన ఎన్నికల సంఘం
- జిల్లాల పునర్విభజన నేపథ్యంలో తాజాగా ఉపాధ్యాయ నియోజకవర్గాల పరిధిలో వచ్చే జిల్లాలు, మండలాలను వెల్లడించిన ఈసీ
- త్వరలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ రానుండటంతో ప్రకటన

# ఏపీలో నూతన క్రీడా పాలసీకి చంద్రబాబు శ్రీకారం

- ఏపీలో కొత్త క్రీడా పాలసీపై చర్చించిన చంద్రబాబు క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకాలు పెంచుతూ నిర్ణయం
- ఒలింపిక్స్ లో బంగారు పతకం సాధించిన వారికి ప్రస్తుతం రూ.75 లక్షలు నగదు ప్రోత్సాహకం
- వారికి రూ.7 కోట్లు ఇవ్వాలని, రజత పతకం సాధిస్తే 50 లక్షలకు బదులు 5 కోట్లు, కాంస్య పతకం సాధిస్తే 30 లక్షలకు బదులు 3 కోట్లు ఇవ్వాలని చంద్రబాబు

### ఏపీ సీఎం చంద్రబాబు తీపి కబురు చెప్పారు



2లో

అమరావతి : క్రీడాకారులకు ఏపీ సీఎం చంద్రబాబు తీపి కబురు చెప్పారు. ఏపీలో కొత్త క్రీడా పాలసీపై చర్చించిన చంద్రబాబు క్రీడాకారులకు న గదు ప్రోత్సాహకాలు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు.

## ఆటోడ్రైవర్ల సత్తా తెలుసు... మా ఓటమిలో మీ పాత్ర కూడా ఉంది



- ఆటోవాలాలు భాషా సినిమాలో రజనీకాంత్‌లా 50 వేలమందిని తీసుకురాగలరన్న కేటీఆర్
- కానీ ఎన్నికల సమయంలో దొంగలను నమ్మి మోసపోయారని వ్యాఖ్య
- ఈ సినిమా మరో నాలుగేళ్లు ఉందన్న కేటీఆర్
- ఒక్కసారి తప్పు చేశాక... మరో నాలుగేళ్లు భరించాల్సిందేనని వ్యాఖ్య

## రాహుల్ గాంధీజీ... అశోక్ నగర్ వచ్చి చూడండి: హరీశ్ రావు



2

- యువతను తప్పుదారి పట్టించారని విమర్శ
- విద్యార్థులను మీ ప్రభుత్వం కొట్టిస్తున్న విషయం తెలుసా? అని ప్రశ్న
- అశోక్ నగర్‌ను మీ ప్రభుత్వం 'శోక్' నగర్‌గా మార్చిందని చురక

హైదరాబాద్ : ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ హైదరాబాద్‌లోని అశోక్ నగర్‌కు వచ్చి చూడాలని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు సవాల్ చేశారు.

## వైసీపీ ప్రభుత్వానికి, మీకు ఏంటి తేడా? : కూటమి ప్రభుత్వంపై షర్మిల ఫైర్



2లో

విద్యుత్ చార్జీల అంశంలో షర్మిల విమర్శనాస్త్రాలు

ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని ఆగ్రహం

మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు పిలుపు

# 47...37...17...
# ఏంది ఈ స్కోరు ?

2లో

ఈ ముచ్చట అంతా 2023 లో జరిగిన ఎన్నికల్లో సాగింది. అంటే సరిగ్గా ఏడాది క్రితం గులాబీ తోటలో గుబులు రేపి గుండెల్లో విషాదాన్ని నిండా నింపిన ఎన్నికలు అన్న మాట. ఇక 2024లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో మరింతగా దిగజారి బీఆర్ఎస్ కి ఏకంగా 17 శాతం ఓటు లభించింది.

హైదరాబాద్ : అవును కదూ ఇవేమి నంబర్లు ఈ మతలబు ఏంటి అంటే అదే కధా రాజకీయ తమాషా అని అనాల్సి ఉంటుంది. అంతే కాదు రాజకీయ కధ కూడా అందులో మిగతా..2లో




# అంతా బీజేపీ మహిమ : పవన్ దూకుడు...టీడీపీ అలెర్ట్

- యూపీలో బీజేపీ సీఎం యోగీ తరహాలో ఏపీలో పదునైన చట్టం వాడాలని పవన్
- కూటమిలో టీడీపీ అయితే అలెర్ట్ కావడానికే పవన్ ఇలా స్టేట్మెంట్ ఇస్తున్నారని సమాధానం
- జమిలి వచ్చినా తన బలాన్ని బలగాన్ని కాపాడుకోవడమే కాకుండా వైసీపీని చిత్తు చేయాలన్నది టీడీపీ ఎత్తుగడ
- ఏపీలో ఎన్నికలు ముగిసి గట్టిగా ఆరు నెలలు కాకుండానే మళ్ళీ రాజకీయ రణన్నినాదాలు వినిపిస్తున్నాయి

కేంద్రంలో బీజేపీ ఎన్నికల మూడ్ లోకి వెళ్ళిపోయింది. జమిలి ఎన్నికల పల్లవిని అందుకుంది. ఈ మధ్యనే కొద్ది నెలల క్రితం సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. బీజేపీకి అయితే ఆ ఫలితాలు కొంత అసంతృప్తిని మిగిలించాయి. ఉందిలే మంచి కాలం అని అనుకోవాలంటే అయిదేళ్ళు ఆగాలి. అంతవరకూ ఊతకర్రల లాంటి మిత్రుల మద్దతుతో కేంద్రంలోని ఎన్డీయే బండిని లాగించాలి. అయితే బీజేపీ పెద్దల మాస్టర్ మైండ్ కాస్తా ఎన్నికలను ముందుకు తీసుకుని వచ్చేస్తోంది. అందుకే జమిలి రాగం అందుకున్నారు. ఆ మేరకు మిత్రులకు స్పష్టమైన సంకేతాలు అందాయి. ఈ నేపథ్యంలో ఏపీలో ఎన్నికలు ముగిసి గట్టిగా ఆరు నెలలు కాకుండానే మళ్ళీ రాజకీయ రణన్నినాదాలు వినిపిస్తున్నాయి. జనసేన అధినేత ఇటీవల రోజుల వ్యవధిలోనే వరసగా రెండు సభలలో పాత జనసేనానిని గుర్తుకు వచ్చేలా బిగ్ సౌండ్ చేశారు. మిగతా..2లో



వివరాలు 2లో..

## గత ఐదేళ్లలో తప్పులు జరిగిన మాట నిజమే: ఏపీ డీజీపీ




2

ప్రస్తుతం వాటిని సరిదిద్దుతున్నామని ద్వారకా తిరుమల రావు వెల్లడి

అనంతపురంలో మీడియా సమావేశం

ఉపముఖ్యమంత్రి వ్యాఖ్యలపై స్పందించిన డీజీపీ

## వామ్మో.. మళ్లీ వానలే వానలు.. ఏపీకి వాతావరణ శాఖ హెచ్చరికలు




ఆంధ్రప్రదేశ్ ను వానలు వీడటం లేదు. వరసగా వానాలు చికాకును కలిగిస్తున్నాయి. ప్రజలు భారీ వర్షాలతో నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా వాతావరణ శాఖ చేసిన హెచ్చరిక నేపథ్యంలో మరో అల్పపీడనం బంగాళాఖాతంలో ఏర్పడనుందని తెలిపింది. వాయవ్య బంగాళా ఖాతంలో నేడు లేదా రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికలు మిగతా..2లో

## మహారాష్ట్ర ఎన్నికలకు ముందు శరద్ పవార్ అనూహ్య ప్రకటన

ఢిల్లీ : రాజకీయ కురువృద్ధుడు, మూడు సార్లు ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తించిన ఎసీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్ మహారాష్ట్ర ఎన్నికలకు ముందు సంచలన ప్రకటన చేశారు. భవిష్యత్‌లో ఎలాంటి ఎన్నికల్లోనూ పోటీ చేసే ఉద్దేశం లేదని ఆయన వెల్లడించారు. రాజ్యసభ ఎంపీ పదవీకాలం పూర్తయిన తర్వాత తిరిగి కొనసాగాలా లేదా అనేదానిపై ఆలోచిస్తానని ఆయన వెల్లడించారు. ప్రస్తుత రాజ్యసభ ఎంపీ గడువు సమీపిస్తోందని ఆయన పేర్కొన్నారు. "నేను 14 సార్లు ఎన్నికల్లో పోటీ చేశాను. లోక్‌సభకు పోటీ చేయను. ఏ ఎన్నికల్లోనూ పోటీ చేయబోను. ఏ ఎన్నికల్లోనూ మీరు నన్ను ఓడించలేదు. ప్రతి ఎన్నికలోనూ మీరు నన్ను గెలిపించారు. కాబట్టి నేను ఎక్కడో ఒక చోట ఆపాలి. కొత్త తరాన్ని తీసుకురావాలి. అయితే నేను సామాజిక సేవను వదలడం లేదు. నాకు అధికారం అక్కర్లేదు" అని శరద్ పవార్ పేర్కొన్నారు. తన మనవడు యుగేంద్ర పవార్‌కు మద్దతుగా బారామతి నియోజకవర్గంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల బహిరంగ ర్యాలీలో ఎన్సీపీ (ఎస్పీ) అధినేత ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కొత్త తరానికి బాధ్యతలు అప్పగించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా శరద్ పవార్ నొక్కి చెప్పారు. ప్రజలకు సేవ చేయడానికి తాను ఏ ఎన్నికల్లోనూ గెలవాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. "నేను అధికారంలో లేను. నేను రాజ్యసభలో ఉన్నాను. రాజ్యసభ ఎంపీ గడువు ఇంకా ఒకటిన్నర సంవత్సరాలే మిగిలి ఉంది. నేను ఇప్పటికే 14 ఎన్నికల్లో పోటీ చేశారు. ఇంకా ఎన్నిసార్లు పోటీ చేస్తాను. కొత్త తరానికి అవకాశం ఇవ్వాలని నేను భావిస్తున్నాను. ముఖ్యంగా గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల వారికి, ఆదివాసీలకు అవకాశం ఇవ్వాలి. ప్రస్తుతం నేను చేస్తున్న కొనసాగించడానికి ఎన్నికలు అవసరం లేదు. "జాతీయ రాజకీయాలు మాత్రమే చేయాలని 30 సంవత్సరాల క్రితం నేను నిర్ణయించుకున్నాను. రాష్ట్ర బాధ్యత అంతా అజిత్ పవార్‌కు అప్పగించాను. దాదాపు గత 25 నుంచి 30 ఏళ్లుగా రాష్ట్ర బాధ్యతలు అజిత్ పవార్ వద్దే ఉన్నాయి. ఇక వచ్చే 30 ఏళ్ల కోసం ఏర్పాట్లు చేయాలి" అని శరద్ పవార్ వ్యాఖ్యానించారు. కాగా ఇప్పటివరకు ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన అజిత్ పవార్‌పై మేనల్లుడు యుగేంద్ర పవార్ పోటీ చేస్తున్నారు. పవార్ కుటుంబానికి కంచుకోటగా ఉన్న బారామతి నియోజకవర్గంలో వీరిద్దరూ తలపడుతుండడం ఆసక్తికరంగా మారింది. కాగా పవార్ రాజ్యసభ పదవీకాలం 2026 సంవత్సరంలో పూర్తవుతుంది.

## ప్రైవేట్ ఆస్తుల స్వాధీనం కుదరదు..!
## చారిత్రాత్మక తీర్పును వెల్లడించిన 'సుప్రీం'...

మొదటి పేజి తరువాయి

సీజేఐ జస్టిస్ చంద్రచూడ్‌తో పాటు మరో ఆరుగురు న్యాయమూర్తులు ఒకటి.. జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సుధాన్షు ధూలియా వేర్వేరుగా మూడు తీర్పును రాశారు. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ హృషికేశ్ రాయ్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ ఎస్సీ శర్మ, జస్టిస్ ఏజీ మసీహ్ రాజ్యాంగ ధర్మాసనం పిటిషన్లపై విచారణ జరిపి తీర్పును వెలువరించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 39(బి) ప్రకారం ప్రతి ప్రైవేటు ఆస్తిని కమ్యూనిటీ ఆస్తిలో భాగంగా పరిగణించలేమని స్పష్టం చేసింది. చట్టాలు, విధానాల రూపకల్పనలో రాజ్యాంగం నిర్దేశించిన మార్గదర్శకాలను ప్రభుత్వాలు పాటించాలని ఈ ఆర్టికల్ చెబుతుందని.. ప్రైవేట్ యాజమాన్యంలోని ఆస్తులు ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవచ్చని.. కానీ, ఒక వ్యక్తికి చెందిన ప్రతి వనరునూ ఉమ్మడి ప్రయోజనంగా పరిగణించబడదని.. అది భౌతిక అవసరాలకు తగినదని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దాంతో సుప్రీంకోర్టు 1978 నాటి ఏడుగురు న్యాయమూర్తుల ధర్మాసనం 4:3 మెజారిటీతో ఇచ్చిన తీర్పును పక్కనపెట్టింది. ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రభుత్వం అన్ని ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చని పేర్కొంది. ప్రత్యేక ఆర్థిక, సామ్యవాద భావజాలం స్ఫూర్తితో ప్రభుత్వం ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చని ఏడుగురు న్యాయమూర్తుల మెజారిటీ నిర్ణయం పేర్కొంది. సర్వోన్నత న్యాయస్థానం తాజా తీర్పుతో ప్రైవేట్ యాజమాన్యాల యాజమాన్యంలోని అన్ని వనరులను ఇకపై ప్రభుత్వం స్వాధీనం చేసుకునేందుకు వీలుండదు. సుప్రీంకోర్టు తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనంలో ఇద్దరు న్యాయమూర్తులు భిన్నమైన నిర్ణయం తీసుకున్నారు. బెంచ్ నిర్ణయాన్ని జస్టిస్ బివి నాగరత్న పాక్షికంగా విభేదించగా.. జస్టిస్ సుధాన్షు ధులియా పూర్తిగా విభేదించారు. రాజ్యాంగం ప్రకారం, ఉమ్మడి ప్రయోజనాల కోసం ప్రైవేట్ యాజమాన్యంలోని అన్ని వనరులను స్వాధీనం చేసుకునే హక్కు ప్రభుత్వాలకు లేదని మంగళవారం 7:2 మెజారిటీ నిర్ణయంలో సుప్రీంకోర్టు పేర్కొంది. అయితే, కొన్ని కేసుల్లో ప్రభుత్వాలు ప్రైవేట్ ఆస్తులను క్లెయిమ్ చేసుకోవచ్చని సీజేఐ నేతృత్వంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల ధర్మాసనం పేర్కొంది.

## అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలు ఎప్పుడు ప్రకటిస్తారు?

మొదటి పేజి తరువాయి

లేదా ఇంతకుముందు కొన్ని సందర్భాలలో జరిగినట్టుగా ఒక నెల రోజులు, వారాలు పట్టే అవకాశం లేకపోలేదు. 2016లో నవంబర్ 8 సాయంత్రం ఓటింగ్ ముగిసింది. నవంబర్ 9 తెల్లవారుజామున 2:30 గంటలకు డొనాల్డ్ ట్రంప్ స్వింగ్ స్టేట్ అయిన విస్కాన్సిన్‌లోని 10 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లను గెలుచుకోవడంతో రిపబ్లికన్ పార్టీ మ్యాజిక్ సంఖ్య 270 ఎలక్టోరల్ ఓట్లను దాటింది. దాంతో ఆయన అధ్యక్ష పీఠం అధిరోహించారు. అదే 2020లో నవంబర్ 3 సాయంత్రం పోలింగ్ ముగిసింది. అయితే, ప్రెసిడెంట్ జో బైడెన్ పెన్సిల్వేనియాలో 19 ఎలక్టోరల్ కాలేజీ ఓట్లను పొందడంలో సమయం పట్టడంతో నవంబర్ 7 వరకు వేచి ఉండాల్సి వచ్చింది. అలాగే 2000 ఎన్నికలలో అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ బుష్ విజయం సాధించగా, విజేతను తేల్చడానికి ఒక నెల కంటే ఎక్కువ సమయం పట్టింది. ఓటింగ్ నవంబర్ 7న ముగిస్తే, తుది ఫలితం డిసెంబర్ 12న తెలిసింది.

అధ్యక్షుడు కావాలంటే ఎంత బలం అవసరం..

అమెరికా అధ్యక్ష ఎన్నికలు మొత్తం జాతీయ ఓట్ల ద్వారా కాకుండా ఎలక్టోరల్ కాలేజీ ఓట్ల వ్యవస్థ ద్వారా జరుగుతాయి. ఇది ప్రజాస్వామ్య ప్రక్రియ అయినప్పటికీ, నేరుగా ప్రజలు అధ్యక్షుడిని ఎన్నుకోరు. వారు తమ సొంత రాష్ట్రంలో ఎలక్టర్లకు ఓటు వేస్తారు. ఈ ఎలక్టర్లు అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. మొత్తం 538 ఎలక్టోరల్ ఓట్లు ఉండగా, అభ్యర్థి గెలవడానికి 270 ఎలక్టోరల్ ఓట్లు అవసరం.

ఎలక్టోరల్ ఓట్ల గురించి..

ప్రతి రాష్ట్రానికి జనాభా ఆధారంగా ఎలక్టోరల్ ఓట్లు ఉంటాయి. 50 రాష్ట్రాలలో జనాభా ఆధారంగా ఎలక్టోరల్ ఓట్లు 435 ఉన్నాయి. అలాగే ప్రతి రాష్ట్రానికి 2 ఎలక్టోరల్ ఓట్లు సెనెట్ ద్వారా వస్తాయి. తద్వారా మొత్తం 535 ఎలక్టోరల్ ఓట్లు ఉన్నాయి. వాషింగ్టన్ డీసీకి 3 ఎలక్టోరల్ ఓట్లు ఉన్నాయి. వీటి ద్వారా ఎన్నికైన ప్రతినిధులు డిసెంబర్‌లో అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. జనవరిలో కాంగ్రెస్ ధ్రువీకరిస్తుంది. ఇక పోలింగ్ ముగింపు సమయం రాష్ట్రం నుండి రాష్ట్రానికి మరియు రాష్ట్రంలోని కౌంటీ నుండి కౌంటీకి మరియు కొన్నిసార్లు అదే కౌంటీలోని నగరాల వారీగా కూడా మారవచ్చు. ఒకవేళ 8 గంటలకు పోలింగ్ ముగిస్తే, ఆ తర్వాత క్యూలో ఉన్న వారు ఎంత సమయం పట్టినా ఓటు వేసే వెసులుబాటు ఉంటుంది.కాగా, స్వింగ్ స్టేట్స్ అయిన ఏడు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలే అమెరికా అధ్యక్షుడిని నిర్ణయిస్తాయి. ఇక సోమవారం ఉదయం నాటికి 7.8 కోట్లకు పైగా అమెరికన్ ఓటర్లు ముందస్తు ఓటింగ్‌లో ఇప్పటికే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా, యూఎస్‌లోని మొత్తం ఓటర్ల సంఖ్య 24.5 కోట్లు.

## ఏపీ ఎమ్మెల్సీ ఉపాధ్యాయ నియోజకవర్గాల పరిధిపై స్పష్టత నిచ్చిన ఈసీ




అమరావతి : ఏపీ శాసనమండలికి సంబంధించి ఉపాధ్యాయ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల సంఘం స్పష్టత నిచ్చింది. జిల్లాల పునర్వి భజన తర్వాత ఏయే జిల్లా లు, ఏయే మండలాలు ఏయే నియోజకవర్గాల పరి ధిలోకి వస్తాయనే దాని పై సందిగ్ధత నెలకొని ఉండగా, ఎన్నికల సంఘం ఉపాధ్యాయ నియోజకవర్గాల పరిధిని ఖరారు చేసింది. ఈ మేరకు సోమవారం వివరాలను వెల్లడించింది. శ్రీకాకుళం %-% విజయనగరం %-% విశాఖపట్నం ఉపాధ్యాయ నియోజకవర్గం పరిధిలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి జిల్లాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోయ, పెదబయలు, డుంబ్రిగూడ, మంచంగిపుట్టు, హుకుంపేట, అనంతగిరి, పాడేరు, జి మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాలు వస్తాయి. తూర్పు %-% పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధిలోకి కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలు, ఏలూరు జిల్లాలోని ఉంగుటూరు, భీమడోలు, నిడమర్రు, గణపవరం, పెదవేగి, పెదపాడు, దెందులూరు, ఏలూరు, ద్వారకాతిరుమల, పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కొయ్యలగూడెం, టి నర్సాపురం, కుక్కునూరు, వేలేరుపాడు, చింతలపూడి, లింగపాలెం, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మండలాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని రంపచోడవరం, ఏజెన్సీ గంగవరం, అడ్డతీగల, వై రామవరం, దేవీపట్నం, రాజవొమ్మంగి, మరేడుమిల్లి, చింతూరు. వరరామచంద్రాపురం, ఎటపాక, కూనవరం మండలాలు ఉంటాయి. కడప %-% అనంతపురం %-% కర్నూలు ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధిలో అనంతపురం, శ్రీ సత్యసాయి, కర్నూలు, నంద్యాల, వైఎస్ఆర్ జిల్లాలు, అన్నమయ్య జిల్లాలోని నందలూరు, రాజంపేట, టి చుండుపల్లి, వీరబల్లి, చిట్యాల, కోడూరు, ఓబులవారిపల్లె, పెనగలూరు, పుల్లంపేట, రాయచోటి, చిన్నముండెం, గాలివీడు, లక్కిరెడ్డిపల్లి, రామాపురం, సంబేపల్లి మండలాలు ఉంటాయి. కృష్ణా %-% గుంటూరు ఉపాధ్యాయ నియోజకవర్గ పరిధిలో కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాలు, ఏలూరు జిల్లాలోని నూజివీడు, ముసునూరు, చాట్రాయి, ఆగిరిపల్లి, కైకలూరు, కదిలిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాలు, బాపట్ల జిల్లాలోని వేమూరు, కొల్లూరు, చుండూరు, భట్టిప్రోలు, అమృతలూరు, నిజాంపట్నం, నగరం, చెరుకుపల్లి, రేపల్లె, బాపట్ల, పిట్టలవానిపాలెం, కర్లపాలెం మండలాలు ఉండనున్నాయి. ప్రకాశం %-% నెల్లూరు %-% చిత్తూరు ఉపాధ్యాయ నియోజకవర్గం పరిధిలో ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలు, బాపట్ల జిల్లాలోని చీరాల, వేటపాలెం, అద్దంకి, జె పంగలూరు, సంతనూతలపాడు, బల్లికురవ, కొరిశపాడు, పర్చూరు, యద్దనపూడి, కారంచేడు, ఇంకొల్లు, చినగంజాం, మార్టూరు, అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి కొత్తకోట, గుర్రంకొండ, కలకడ, కెవి పల్లె, పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, చిత్తూరు. తిరుపతి మండలాలు ఉంటాయి.

# 47...37...17...ఏంది ఈ స్కోరు ?




మొదటి పేజి తరువాయి

దాగుతుందని చెప్పాల్సి ఉంటుంది. ఇదంతా గులాబీ తోటలో పూచిన బీఆర్ఎస్ గురించే అని వేరేగా వివరించాల్సిన పని కూడా లేదు అంటున్నారు. / ఇంతకీ ఈ నంబర్ల వెనక ఏముంది అంటే చాలానే ఉంది అన్నదే కదా జవాబు. 47 అంటే బీఆర్ఎస్ కి 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓటు శాతం అన్న మాట. ప్రతీ వందలో 47 ఓట్లు బీఆర్ఎస్ కి ఆనాడు పడ్డాయి. అలా అద్భుతమైన విజయం నాడు బీఆర్ఎస్ దక్కించుకుని శభాష్ అనిపించుకుంది. తీరా చూస్తే అయిదేళ్ల పాలనలో ఆ 47 శాతం ఓటు కాస్తా కరిగిపోయి 37 శాతానికి చేరింది. ఈ ముచ్చట అంతా 2023 లో జరిగిన ఎన్నికల్లో సాగింది. అంటే సరిగ్గా ఏడాది క్రితం గులాబీ తోటలో గుబులు రేపి గుండెల్లో విషాదాన్ని నిండా నింపిన ఎన్నికలు అన్న మాట. ఇక 2024లో జరిగిన లోక్ సభ ఎన్నికల్లో మరింతగా దిగజారి బీఆర్ఎస్ కి ఏకంగా 17 శాతం ఓటు లభించింది. అంటే కేవలం ఆరు నెలల తేడాలో ఇరవై శాతం ఓటు తగ్గిపోయింది అన్న మాట. అలా గులాబీ తోట వసివాడి రాజకీయంగా పసి కూన అయిపోయింది. తెలంగాణాలో మొత్తం 17 ఎంపీ సీట్లు ఉంటే ఒక్కటి కూడా బీఆర్ఎస్ గెలుచుకోలేక చతికిలపడింది. ఈ ఎన్నికల ఫలితాలు చూసిన తరువాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసలు బయటకు రావడమే మానుకున్నారు అని అంటున్నారు. ఇక బీఆర్ఎస్ ని నడిపించే భారం అంతా హరీష్ రావు కేటీఆర్ ల మీద పడింది. అయితే ఈ ఇద్దరి మధ్యన అభిప్రాయ భేదాలు కూడా ఉన్నాయని అంటున్నారు. ఆ విధంగా ప్రచారం అయితే సాగుతోంది. అంతే కాదు కేసీఆర్ ముద్దుల తనయ బీఆర్ఎస్ మహిళా నాయకురాలు అయిన కవిత కొన్ని నెలల పాటు జైలులో ఉన్నారు. ఆ మీదట ఆమె బెయిల్ మీద బయటకు వచ్చినా అసలు బయటకు రావడమే లేదు. ఆమె పబ్లిక్ లో కనిపించి చాలా కాలం అయింది అని అంటున్నారు.


బీఆర్ఎస్ లో నేపథ్యం అంతా ఇలా ఉంది. ఈ అయోమయ పరిస్థితుల్లో ఈ గందరగోళంలో కేటీఆర్ అయితే తాను తెలంగాణా అంతా పాదయాత్ర చేస్తాను అని అంటున్నారు. ఆ విధంగా రాష్ట్రమంతా తిరిగి బీఆర్ ఎస్ కి తానే అసలైన అధినేతను అని ఫోకస్ చేసుకోవడంతో పాటు రేపటి రోజున బీఆర్ఎస్ లో ముఖ్యమంత్రి అభ్యర్థిని కూడా తానే అని ప్రాజెక్ట్ చేసుకోవడానికే కేటీఆర్ వేసిన ఎత్తుగడ ఇది అని అంటున్నారు. అది పసిగట్టిన హరీష్ రావు టీం కి ఇవన్నీ అసలు నచ్చడం లేదు అని అంటున్నారు. ఇక బీఆర్ఎస్ కి మూలమైన అస్తిత్వంగా ఉన్న తెలంగాణా సెంటిమెంట్ పోయింది.

దానిని కేసీఆర్ తానుగానే వదిలేశారు అని అంటున్నారు. జాతీయ పార్టీగా బీఆర్ఎస్ ని ఒక లెవెల్ లోకి తీసుకుని వచ్చేస్తున్నామన్న భ్రమలలో ఉన్నది కాస్తా లేకుండా చేసుకున్నారు అని అనాడే అనుకున్నారు. ఆ విధంగా బీఆర్ఎస్ ఎటూ కాకుండా ఉంది. కేసీఆర్ మళ్లీ తెలంగాణా సెంటిమెంట్ ని రగిలించలేని విధంగా పరిస్థితి ఉంది. ఈ విధంగా దిగాలుగా దిక్కులు చూస్తూ ఉన్న బీఆర్ఎస్ కోలుకోవడానికి ఏడాది సమయం కూడా చాలడం లేదు అని కళ్ల ముందు పరిస్థితి చూపిస్తోంది.

అయితే కేటీఆర్ మాత్రం అంతా అయిపోయినట్లే ఇక పాదయాత్రతో అధికారం అందుకోవడమే ఇక మిగిలింది అన్నట్లుగా ఆర్భాటాలు చేస్తున్నారు అని అంటున్నారు. బీఆర్ ఎస్ అయినా దాని పూర్వానామం టీఆర్ ఎస్ అయినా తెలంగాణావే ఊపిరి. అదే ఆ పార్టీకి జీవం. అలాంటిది ప్రాణాధారం అన్నది ఇపుడు లేకుండా పోయింది. మరో వైపు తెలంగాణా రాష్ట్రం ఏర్పడిన తరువాత ఆటోమేటిక్ గా అభివృద్ధి వైపే ప్రజల దృష్టి ఉంది. అంతే కాకుండా ఉపాధి కోసం కూడా జనాలు చూస్తున్నారు.

ఆ దిశగా ఆలోచనలు చేయాల్సిన చోట మళ్లీ తెలంగాణా వాదాన్ని తెచ్చినా గతంలో మాదిరిగా వర్కౌట్ అయ్యే చాన్స్ లేదని అంటున్నారు. కేసీఆర్ ఉజ్వల ప్రభ అన్నది 2001 నుంచి 2018 దాకా ఒక వెలుగు వెలిగింది. ఆ టైం లో ఆయన ఏమి అన్నా శాసనంగా మారింది. అయితే ఆ తరువాత రాజకీయం మొత్తం మారింది. దానికి అంచనా వేయడంలో విఫలం కావడం వల్లనే బీఆర్ఎస్ ఇపుడు ఈ విధంగా ఇబ్బంది పడుతుంది అని అంటున్నారు. ఏది ఏమైనా కేసీఆర్ మౌనం దాల్చారు అంటే అందులో ఎన్ని అర్థాలు అయినా వెతకవచ్చు అని అంటున్నారు. మొత్తం మీద బీఆర్ఎస్ ఏడాదికే కాంగ్రెస్ మీద వ్యతిరేకత వచ్చేసిందని తమదే అధికారం ఇక అనుకుంటే మాత్రం రివర్స్ గేర్ వేస్తున్నట్లే అంటున్నాయి రాజకీయ విశ్లేషణలు.

## వైసీపీ ప్రభుత్వానికి, మీకు ఏంటి తేడా?
## కూటమి ప్రభుత్వంపై షర్మిల ఫైర్



అమరావతి : ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విద్యుత్ చార్జీల అంశంలో కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలపై గత ప్రభుత్వ పాపాలకు ప్రాయశ్చిత్తం చేయాల్సిన కూటమి ప్రభుత్వం, ఆ పాపపు పరిహారాన్ని ప్రజల నెత్తినే మోపుతోందని మండిపడ్డారు. రూ.18 వేల కోట్ల సర్దుబాటు చార్జీలు, వసూళ్ల విషయంలో తమ తప్పేం లేదని, తమకసలు సంబంధమే లేదని, ఆ భారం తమది కాదని, ప్రజలపైనే ఆ భారం మొత్తం మోపుతున్నారని షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది సర్దుబాటు కాదని, ప్రజలకు సర్దుపోటు అని అభివర్ణించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన భారీ కరెంట్ షాక్ అని పేర్కొన్నారు. "విద్యుత్ చార్జీల అంశంలో వైసీపీ చేసింది పాపం అయితే, రాష్ట్ర ప్రజలకు టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వం పెడుతున్నది శాపం. గత సర్కారు తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో ప్రజలకు ఏమిటి సంబంధం? ప్రభుత్వం ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తే, ఆ అదనపు భారాన్ని ప్రజలపై మోపుతారా? విద్యుత్ కొనుగోళ్ల విషయంలో గత ఐదేళ్లలో వైసీపీ మోపిన భారం రూ.35 వేల కోట్లు అయితే, ఈ ఐదు నెలల్లో కూటమి ప్రభుత్వం మోపిన భారం రూ.18 వేల కోట్లు! వైసీపీకి మీకు తేడా ఏంటి? వైసీపీ ప్రభుత్వం తొమ్మిది సార్లు కరెంటు చార్జీలు పెంచిందని అన్నారు... కూటమి అధికారంలోకి వస్తే ఒక్క రూపాయి కూడా కరెంటు చార్జీలు పెంచబోమన్నారు... అవసరమైతే 30 శాతం తగ్గిస్తామని కూడా ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీకి కట్టుబడి ఉంటే, అదనపు భారాన్ని ప్రజలపై మోపకూడదన్న చిత్తశుద్ధి మీకుంటే వెంటనే ఆ రూ.18 వేల కోట్ల సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి. అదనపు భారం తగ్గించేందుకు నిధులు ఇవ్వాలని మోదీని గల్లా పట్టి అడగండి. ఇకపై ప్రజల నుంచి ఒక్క రూపాయి అదనంగా వసూలు చేసినా ఒప్పుకునేది లేదు. ఈ మేరకు కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ హెచ్చరిస్తోంది. ట్రూఅప్ చార్జీల రూపంలో అధిక విద్యుత్ బిల్లులు వసూలు చేస్తున్నందుకు నిరసనగా రేపటి నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు కాంగ్రెస్ పార్టీ తరపున పిలుపునిస్తున్నాం" అని షర్మిల ట్వీట్ చేశారు.

# ఏపీలో నూతన క్రీడా పాలసీకి చంద్రబాబు శ్రీకారం

మొదటి పేజి తరువాయి

ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్, వరల్డ్ చాంపియన్స్, నేషనల్ గేమ్స్, ఖేలో ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్ లో పతకాలు సాధించిన వారి నగదు ప్రోత్సాహకాన్ని భారీగా పెంచారు. తాజా నిర్ణయంతో ఈ నగద ప్రోత్సాహకాల్లో హర్యానాను ఏపీ వెనక్కి నెట్టింది. దేశంలోనే క్రీడాకారులకు అత్యధిక నగదు ప్రోత్సాహకాలిచ్చే రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. ఒలింపిక్స్ లో బంగారు పతకం సాధించిన వారికి ప్రస్తుతం రూ.75 లక్షలు నగదు ప్రోత్సాహకం ఇస్తున్నారు. ఇకపై వారికి రూ.7 కోట్లు ఇవ్వాలని, రజత పతకం సాధిస్తే 50 లక్షలకు బదులు 5 కోట్లు, కాంస్య పతకం సాధిస్తే 30 లక్షలకు బదులు 3 కోట్లు ఇవ్వాలని చంద్రబాబు సూచించారు. ఒలింపిక్స్ లో పాల్గొన్న వారికి రూ.50 లక్షల చొప్పున ప్రోత్సాహకం ఇవ్వాలని కూడా సూచించారు.

ఏషియన్ గేమ్స్ లో బంగారు పతకం సాధిస్తే రూ.4 కోట్లు, రజతం సాధిస్తే రూ.2 కోట్లు, కాంస్యం సాధిస్తే రూ.1 కోటి ప్రోత్సాహకం ఇవ్వాలని సూచించారు. ఏషియన్స్ గేమ్స్ లో పాల్గొన్న వారికి రూ.10 లక్షలు ఇవ్వాలని పేర్కొన్నారు. వరల్డ్ ఛాంపియన్ షిప్, వరల్డ్ కప్ పోటీల్లో స్వర్ణ పతకం సాధిస్తే రూ.50 లక్షలు, రజతం సాధిస్తే రూ.35 లక్షలు, కాంస్యం సాధిస్తే రూ.25 లక్షలు ఇవ్వబోతున్నారు.

నేషనల్ గేమ్స్ లో బంగారు పతకం సాధించిన వారికి రూ.10 లక్షలు, రజతం సాధించిన వారికి రూ.5 లక్షలు, కాంస్య పతకం సాధించిన వారికి రూ.3 లక్షల ప్రోత్సాహం ఇవ్వాలని ప్రతిపాదనలు చేశారు. ఖేలో ఇండియా గేమ్స్, నేషనల్ స్కూల్ గేమ్స్ లో బంగారు పతకం సాధించిన వారికి రూ.2.50 లక్షలు, రజత పతకం సాధించిన వారికి రూ.2 లక్షలు, కాంస్యం సాధించిన వారికి రూ.1 లక్ష చొప్పున ప్రోత్సాహం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఒలింపిక్, ఏషియన్ గేమ్స్ లో పతకాలు సాధిస్తే గ్రూప్-1 ఉద్యోగాలివ్వాలని సూచించారు.

## రాహుల్ గాంధీజీ... అశోక్ నగర్ వచ్చి చూడండి: హరీశ్ రావు

మొదటి పేజి తరువాయి

రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో తెలంగాణ యువతను తప్పుదారి పట్టించిందని మండిపడ్డారు. అశోక్ నగర్‌లో విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేస్తున్న వీడియోను హరీశ్ రావు ఎక్స్ వేదికగా పోస్ట్ చేసి... కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మీరు (రాహుల్ గాంధీ) ఎన్నికలకు ముందు ఏ ప్రాంతంలో అయితే నిరుద్యోగ యువతను కలిసి మాట్లాడారో... అదే ప్రదేశంలో ఈ ప్రజాప్రభుత్వం వారిని పోలీసులతో కొట్టించిందని మీకు తెలుసా? అని రాహుల్ గాంధీని ఉద్దేశించి ట్వీట్‌లో పేర్కొన్నారు. హైదరాబాద్‌కు వస్తున్న మీరు ఒకసారి అశోక్ నగర్‌ను సందర్శించి అక్కడి విద్యార్థులతో మాట్లాడాలని... వారి ఆవేదనను వినాలని సూచించారు. అశోక్ నగర్ ను 'శోక' నగరంగా మార్చిన ఈ ప్రజాప్రభుత్వం తీరును చూడాలని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన మీరు... కనీసం 10 శాతం కూడా ఇవ్వలేదని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీని యూపీఎస్సీ తరహాలో ప్రక్షాళన చేస్తామని చెప్పారని... కానీ టీజీపీఎస్సీగా మార్చి చేతులు దులుపుకున్నారన్నారు. ఇది జాబ్ లెస్ క్యాలెండర్‌గా మిగిలిపోయిందని చురక అంటించారు. నిరుద్యోగ భృతి, యువవికాసం కింద ఇస్తామన్న రూ.5 లక్షల హామీని నెరవేర్చడం లేదని దీంతో యువతలో అభద్రతా భావం కనిపిస్తోందన్నారు. నిరుద్యోగుల పట్ల, విద్యార్థుల పట్ల మీరు, మీ పార్టీ చూపిన కపట ప్రేమ బట్టబయలైందన్నారు. కాంగ్రెస్ కర్కశ పాలనను నిరుద్యోగ యువత తప్పకుండా గుర్తు పెట్టుకుంటుందని హెచ్చరించారు.

## గత ఐదేళ్లలో తప్పులు జరిగిన మాట నిజమే: ఏపీ డీజీపీ

అమరావతి : ఆంధ్రప్రదేశ్ లో గత ఐదేళ్లలో కొన్ని తప్పులు జరిగిన మాట వాస్తవమేనని డీజీపీ ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై డీజీపీ తాజాగా స్పందించారు. డిప్యూటీ సీఎం వ్యాఖ్యలపై తాను ఎలాంటి కామెంట్ చేయబోనని చెప్పారు. ఈమేరకు మంగళవారం అనంతపురంలో డీజీపీ మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని పొరపాట్లు, తప్పులు జరిగాయని ఒప్పుకుంటున్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఆ తప్పులను సరిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. ఏపీలో మానవ హక్కులు, మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామని డీజీపీ చెప్పారు. పోలీసు వ్యవస్థను ప్రజలకు బాధ్యతాయుతంగా ఉండేలా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోలీసులు కూడా సరిగా విధులు నిర్వహించలేదని, ఓ పార్టీ కార్యాలయంపై దాడి జరిగినా బాధ్యతాయుతంగా వ్యవహరించలేదని డీజీపీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. భావప్రకటనా స్వేచ్ఛ వల్ల దాడి జరిగిందని రాసుకున్నారు తప్పితే ఒక్కరిని కూడా అరెస్ట్ చేయలేదని వివరించారు. ఐజీ సంజయ్ పై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం విచారణ జరిపిస్తోందని గుర్తుచేశారు. దీనిపై నివేదిక తొలుత జీఏడికి వెళుతుందని, అక్కడి నుంచి తమకు అందుతుందని చెప్పారు. తప్పు జరిగితే ఎన్ని ఏళ్ల తర్వాతైనా చర్యలు తీసుకునే అవకాశం ఉందని చెబుతూ.. కేరళలో ఓ ఐపీఎస్ కు 20 ఏళ్ల తర్వాత శిక్ష విధించారని డీజీపీ గుర్తుచేశారు.

## వామ్మో.. మళ్లీ వానలే వానలు..
## ఏపీకి వాతావరణ శాఖ హెచ్చరికలు

మొదటి పేజి తరువాయి

ఆంధ్రప్రదేశ్ వాసులను కలవరానికి గురి చేస్తున్నాయి. దీంతో ఉష్ణోగ్రతలు కనిష్టంగా పడిపోయి.. అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో ఏపీలో మళ్లీ వానలు మొదలవుతాయని చెబుతున్నారు.

ఈ ప్రాంతాల్లో...

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో విస్తరించి ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రభాశంతో ఆంధ్రప్రదేశ్ లో రాబోయే పది రోజుల పాటు మోస్తరు నుంచి తేలిక పాటి వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాలతో పాటు యానాంలలో వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. అలాగే రాయలసీమలోనూ పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశముందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరికల నేపథ్యంలో అధికారులు కూడా అప్రమత్తమయ్యారు. ప్రజలు కొంత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు.

వరసగా వర్షాలతో...

ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ లో వరసగా వర్షాలు పడుతుండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. అలాగే చిరు వ్యాపారులు చితికి పోతున్నారు. అదేసమయంలో రహదారులన్నీ జలమయం కావడంతో అనేక చోట్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. వర్షం కురవాలని అందరూ కోరుకుంటారు. అప్పుడే పంటలు సమృద్ధిగా పండుతాయి. కానీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ఏపీ ప్రజలను చికాకును తెప్పిస్తున్నాయి. మరోవైపు తెలంగాణలోనూ వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. అనేక ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశముందని పేర్కొంది. కొన్ని జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని తెలిపింది.ద

## ఆటోడ్రైవర్ల సత్తా తెలుసు... మా ఓటమిలో మీ పాత్ర కూడా ఉంది

హైదరాబాద్ : ఆటో డ్రైవర్ల సత్తా మాకు తెలుసు... మీరు తలుచుకుంటే భాషా సినిమాలో రజనీకాంత్‌లా 50 వేలమందిని తీసుకురాగలరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గత ఎన్నికల్లో మమ్మల్ని (బీఆర్ఎస్) ఓడించడంలో మీ పాత్ర కూడా ఉందని ఆటో డ్రైవర్లను ఉద్దేశించి అన్నారు. అయితే ఆటో డ్రైవర్లు ఆ రోజు దొంగల మాటలు నమ్మి మోసపోయారన్నారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ఆటో డ్రైవర్ల మహాధర్నాలో కేటీఆర్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మార్పు మార్పు అని కాంగ్రెస్ అంటే ఆటో డ్రైవర్లతో పాటు యావత్ తెలంగాణ నమ్మి మోసపోయిందన్నారు. రాహుల్ గాంధీ అశోక్ నగర్ వచ్చి.. ఛాయ్ తాగి ఫోజు కొట్టి ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పాడని... కానీ దానిని నెరవేర్చలేదన్నారు. రైతుబంధు రూ.15 వేలు, వృద్ధులకు పెన్షన్ల పెంపు... ఇలా ఏ హామీని అమలు చేయలేదన్నారు. ఈ సినిమా ఇంకా నాలుగేళ్లు (కాంగ్రెస్ ప్రభుత్వం మరో నాలుగేళ్లు ఉంటుందనే ఉద్దేశంలో) ఉందన్నారు. ఒక్కసారి తప్పు చేస్తే భరించాల్సిందే అన్నారు. అయితే తమను ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా... జైల్లో పెట్టినా మీ తరపున కొట్లాడుతామని హామీ ఇచ్చారు. మన హక్కుల గురించి మనం కొట్లాడితే తప్పులేదన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీని కోరుతున్నామన్నారు. ఎంతోమంది ఆటో డ్రైవర్ల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. ఉచిత బస్సు ప్రయాణానికి బీఆర్ఎస్ వ్యతిరేకం కాదని... కానీ హామీ మేరకు ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఇందుకోసం రానున్న బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. ఉచిత ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. 420 హామీలు ఇచ్చి... అడ్డగోలు గ్యారెంటీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి చేసేందుకు అన్ని పార్టీలు ఒక్కటి కావాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. సంఘటితమైన పోరాటాలు కార్మికుల హక్కులను కాపాడేందుకే అన్నారు. ఎన్నికలకు మరో నాలుగేళ్ల సమయం ఉందని... కాబట్టి అప్పటి రాజకీయం అప్పుడు చూసుకుందామన్నారు. కాబట్టి అప్పటి వరకు అన్ని పార్టీలు కలిసిమెలిసి కార్మికుల సమస్యలపై పోరాడాల్సి ఉందన్నారు. ఆటో డ్రైవర్ల ధర్నా గురించి, వారి డిమాండ్ల గురించి తాము అసెంబ్లీలో, బయటా కొట్లాడుతామన్నారు.

పోలీసులకు విజ్ఞప్తిద:- ఈ మహాధర్నా సందర్భంగా కేటీఆర్ పోలీసులకు కూడా ఓ విజ్ఞప్తి చేశారు. పోలీసులు తమ విధులను నిర్వర్తించాలని... కానీ పేదవారి పట్ల, ఇలాంటి (ధర్నాలు) సమయాల్లో... పోలీసులు కాస్త మానవత్వం చూపాలన్నారు. రేవంత్ రెడ్డికి పోలీసులపై నమ్మకం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో పోలీసు పరిస్థితి కూడా ఏమీ బాగా లేదన్నారు. పోలీసులతోనే బెటాలియన్ పోలీసుల కుటుంబాలను కొట్టించారని ఆరోపించారు.

## అంతా బీజేపీ మహిమ : పవన్ దూకుడు...టీడీపీ అలెర్ట్

మొదటి పేజి తరువాయి

తొక్కి పట్టి నారా తీస్తాను అని ఏలూరు సభలో చెప్పిన పవన్ విపక్షాలకు అలా గట్టి వార్నింగ్ ఇచ్చేసారు ఇక లేటెస్ట్ గా పిఠాపురం సభలో మాట్లాడిన ఆయన స్వపక్షానికే స్వీట్ వార్నింగ్ ఇచ్చేశారు. లా అండ్ ఆర్డర్ ఏపీలో బాగాలేదని సౌండ్ వచ్చేలా పవన్ చేసిన గర్జనలో చాలానే మ్యాటర్ ఉంది అని అంటున్నారు. ఆయన సొంత నియోజకవర్గం పిఠాపురం నుంచి వినిపించిన ఈ హెచ్చరికలో ఎన్నో అర్థాలు పరమార్థాలు ఉన్నాయని అంటున్నారు. తప్పు జరిగితే సొంత ప్రభుత్వం అయినా చూడను అన్న సంకేతాన్ని జనంలోకి పంపించడం అందులో ఒకటి అయితే తమ ప్రభుత్వంలోనూ తప్పులు జరుగుతున్నాయని హెచ్చరించి అలెర్ట్ చేయడం మరో ఉద్దేశ్యం అని అంటున్నారు. ఇక జనసైనికులకు హుషారు తెప్పించడం మరో అతి ముఖ్యమైన విషయం. ఏది ఏమైనా చాలా కాలానికి పవన్ లో దూకుడు చూశామని జనసైనికులు సంతోషిస్తూంటే తమ తరపున ప్రభుత్వంలో కీలకంగా ఉంటున్న పవన్ గొంతు విప్పుతున్నారని ఏపీ జనం అనుకుంటున్నారు. ఇక కూటమిలో టీడీపీ అయితే అలెర్ట్ కావడానికే పవన్ ఇలా స్టేట్మెంట్ ఇస్తున్నారని సమాధానం పడాల్సి వస్తోంది. అయితే జమిలి ఎన్నికలు అంటే మరో రెండున్నరేళ్ళలో వస్తాయి. చూస్తూండగానే కాలం కరిగిపోతుంది. దాంతో ప్రభుత్వంలో ఉన్న వారికి యాంటీ ఇంకెంబెన్సీ ఉంటుంది. దానిని బ్యాలెన్స్ చేసేందుకు అదే సమయంలో తన బలాన్ని పెంచుకునేందుకు పవన్ ఈ తరహా కామెంట్స్ చేశారు అని అంటున్నారు. అంతే కాదు విపక్షాలకు ఏ మాత్రం చాన్స్ ఇవ్వకుండా ప్రభుత్వంలోనే ప్రతిపక్షంగా ఉంటూ డ్యూయల్ రోల్ పోషించడం ద్వారా పవన్ వైసీపీకి ఝలక్ ఇచ్చారని కూడా అంటున్నారు ఇక ఏపీలో పవన్ ఆశాజ్యోతిగా బీజేపీ పెద్దలకు కనిపిస్తున్నారు. పవన్ మాట భాష కూడా వారిని అనుకూలంగా మారుతోంది. ఆయన ఇస్తున్న ఉదాహరణలు కూడా బీజేపీ ముఖ్యమంత్రులవి కావడం విశేషం. యూపీలో బీజేపీ సీఎం యోగి తరహాలో ఏపీలో పదునైన చట్టం వాడాలని పవన్ సూచిస్తున్నారు. అంటే బీజేపీ తరహా పాలన కావాలని ఆయన కోరుకుంటున్నారు అని చెబుతున్నారు ఏపీలో పవన్ ద్వారా జమిలి ఎన్నికల్లో తమ బలాన్ని పెంచుకోవడంతో పాటు రేపటి రోజున ఏపీలో అధికారానికి మరింత దగ్గర కావాలని బీజేపీ వేస్తున్న ఎత్తులలో భాగంగా పవన్ దూకుడుని చూడవచ్చా అంటే రాజకీయాల్లో ఎలాగైనా విశ్లేషించుకోవచ్చు అని అంటున్నారు ఇక తెలుగుదేశం విషయానికి వస్తే కూటమిలో మూడు పార్టీలూ కలసి ఉన్నా చాన్స్ వస్తే బీజేపీ జనసేన రెండూ ఒక్కటిగా నిలబడతాయన్న డౌట్లూ ఉన్నాయి. దాంతో తనదైన వ్యూహాలను రచిస్తూ టీడీపీ ముందుకు పోతోంది. జమిలి వచ్చినా తన బలాన్ని బలగాన్ని కాపాడుకోవడమే కాకుండా వైసీపీని చిత్తు చేయాలన్నది టీడీపీ ఎత్తుగడగా ఉంది. అదే సమయంలో కూటమిని పదిలంగా ఉంచుకోవడం ఇవే పొత్తులను కంటిన్యూ చేయడం కూడా టీడీపీ ఆలోచన అని చెబుతున్నారు. మిత్రులు ఎంత దూకుడు చేసినా టీడీపీ కనుసన్నల్లోనే ఏపీ రాజకీయం సాగేలా పసుపు శిబిరంలో అపర చాణక్యం సాగుతోందని అంటున్నారు. ఏది ఏమైనా జమిలి వేడి అయితే కూటమిలో కనిపిస్తోంది అనడానికి లేటెస్ట్ పొలిటికల్ డెవలప్మెంట్స్ ఉదాహరణగా చెబుతున్నారు.

# ఏపీలో పెన్షన్ అర్హులకు శుభవార్త
## ఆరు నెలలకోసారి కొత్త పింఛన్లు: మంత్రి కొండపల్లి



ఏపీలో (శుభోదయం న్యూస్) : ఎన్టీఆర్ భరోసా కింద జనవరిలో కొత్త పింఛన్ల మంజూరుకు చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత 6 నెలలకోసారి అర్హతను బట్టి కొత్తవారికి పెన్షన్లు మంజూరు చేయాలని సూచించారు.భర్త చనిపోయినవారికి డెత్ సర్టిఫికెట్ సమర్పించిన మరుసటి నెల నుంచే పింఛన్ ఇవ్వాలని స్పష్టం చేశారు. అలాగే 3 నెలల పింఛన్ ఒకేసారి ఇచ్చే విధానం డిసెంబర్ నుంచే అమలు చేయాలన్నారు.

# ఏపీలో 108, 104 సర్వీసుల నుంచి 'అరబిందో' ఔట్!





(శుభోదయం న్యూస్) : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 108 (అత్యవసర వైద్యం), 104 (సంచార వైద్యం) సర్వీసుల నిర్వహణ బాధ్యతల నుంచి అరబిందో సంస్థ వైదొలిగే అవకాశాలు ఉన్నాయి.ఈ రెండు సర్వీసుల పనితీరు ఘోరంగా ఉందంటూ ఎన్డీయే ప్రభుత్వానికి పెద్దసంఖ్యలో ఫిర్యాదులు అందాయి. నిర్వహణ దారుణంగా ఉందని నిఘా సంస్థలూ ప్రభుత్వానికి నివేదించాయి. బాధ్యతల నుంచి తమకు తాముగా తప్పుకోవాలని లేదంటే తనకు ఉన్న అధికారాల్ని అనుసరించి కఠిన చర్యలు తీసుకుంటామని అరబిందో యాజమాన్యానికి స్పష్టం చేసింది.

# ఏపీలో బీఎస్సీ నర్సింగ్ కోర్సులకు దరఖాస్తులు



(శుభోదయం న్యూస్) : ఏపీలో బీఎస్సీ నర్సింగ్ నాలుగేళ్లు, రెండేళ్ల కోర్సులకు రెండో విడత కౌన్సెలింగ్ కు ఎన్టీఆర్ వర్సిటీ షెడ్యూల్ విడుదల చేసింది. అర్హత కలిగిన అభ్యర్థులు ఇవాల్టి నుంచి 7వ తేదీ వరకు అప్లై చేసుకోవచ్చని తెలిపింది.కన్వీనర్ కోటాలో 8,804 సీట్లు అందుబాటులో ఉండగా తొలి విడతలో 6,664 భర్తీ అయ్యాయి. మిగిలిన అన్ని సీట్లను రెండో విడతలోనే భర్తీ చేస్తారు.

# 130 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత




గుంటూరు, (శుభోదయం న్యూస్): గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నుంచి 130 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా కాకినాడకి తరలిస్తుండగాగుంటూరు పట్టణంలో రేషన్ వాహనాన్ని పోలీసులు రెవెన్యూ,విజిలెన్స్ అధికారులు మాటు వేసి పట్టుకున్నారు.ప్రతిపాడులో ఓ రైస్ మిల్లు నుంచి అక్రమంగాతరలిస్తున్నట్లు సమాచారం. గుంటూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

# వల్లీ సమేత భుజంగేశ్వరుని
## సన్నిధిలో ఎస్సై కిషోర్ బాబు ప్రత్యేక పూజలు



ప్రకాశం జిల్లా బ్యూరో - చంద్ర (శుభోదయం న్యూస్): అన్ని మాసాలలోకెల్లా కార్తీక మాసం ఉత్తమమైనదిగా పరిగణిస్తారని, ఈ మాసంలో భక్తులు శివకేశవులను పూజించి పూజించి వారి అనుగ్రహానికి పాత్రులు అవుతారని పామూరు సబ్ ఇన్స్పెక్టర్ టి కిషోర్ బాబు అన్నారు. కార్తీక సోమవారం రోజున కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణంలోని ఎంతో విశిష్టత కలిగిన పురాతనాలయం శ్రీ మదన వేణుగోపాలస్వామి, శ్రీ వల్లి సమేత భుజంగేశ్వర స్వామి,శ్రీ వరదరాజుల స్వామి, నవగ్రహాల వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు నారాయణంసత్యబాబు, మహంకాళి శివప్రసాద్, ఆలయ నిర్వాహకులు కిషోర్ బాబుకు కు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివార్ల శేష వస్త్రం తో సన్మానించి తీర్థప్రసాదాలు, వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుర్రం వెంకటేశ్వర్లు, ఆలయ సిబ్బంది,సరాబు చంద్ర, దేవాదాయ శాఖ సిబ్బంది, స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్ర మాల జేఏసీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పణ!



టంగుటూరు మండల రిపోర్టర్ వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- ఎస్ రిజర్వేషన్ వర్గీకరణ క్రిమిలేయర్ వలన మాలలకు మాదిగలకు కూడా భవిష్యత్తులో తీవ్రమైన నష్టం జరుగుతుందని తెలియజేస్తూ ఈ విషయంపై ప్రకాశం జిల్లా ఇన్చార్జి మినిస్టర్ ఆనం రామ్ నారాయణ రెడ్డికి జిల్లా కలెక్టర్ తమిమ్




అన్సారియా కు వినతి పత్రం సమర్పించినట్లు రాష్ట్ర మాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ఎస్సీల్లో 59 ఉప కులాలను పరిశీలించి వెనుకబాటు తనానికి గురైన సామాజిక వర్గాన్ని గుర్తించి పంజాబ్ తమిళనాడు రాష్ట్రాల తరహాలో రిజర్వేషన్లు పెంచాలన్నారు. అదేవిధంగా ఎస్సీ జనాభా పెరిగిందని దానికి అనుగుణంగా రిజర్వేషన్ల శాతాన్ని 25 శాతం పెంచాలన్నారు. రద్దు చేసిన దళిత పథకాలు తిరిగి ప్రవేశపెట్టాలని తెలియజేస్తూ వినతిపత్రం సమర్పించినట్లు అశోక్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎర్రమాల జనార్ధన్ జిల్లా కన్వీనర్ పిల్లి మాలాద్రి జై భీమ్ రావ్ పార్టీ జిల్లా అధ్యక్షులు కే కృపారావు రమేష్ జాన్ శ్రీకాంత్ క్రాంతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

# రబీకి 25% రాయితీపై శనగ విత్తనాల పంపిణీ!




టంగుటూరు మండల రిపోర్టర్ వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- రబీ 2024 - 25సం గాను 25% మీద శనగ విత్తనాలు ఇస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి జీ స్వర్ణలత అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అనంతవరం వెలగపూడి గ్రామ పంచాయతీ కార్యాలయాల ఆవరణంలో మంగళవారం జరిగిన సదస్సుల్లో ఆమె మాట్లాడుతూ ఈ రబీ సీజన్ 2024 - 25సం గాను ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద శనగ వరి మినుము జొన్న ఏడుమిరప మొక్కజొన్న పంటలు గుర్తించడం జరిగిందన్నారు. ఆయా పంటల సాగు చేయు రైతులు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల సంబంధించిన అధికారులు మరియు అనంతవరం సర్పంచ్ ఉప్పలపాటి శ్రీనివాసరాజు ఉపసర్పంచి కసుకుర్తి భాస్కర్ ఎంపిటిసి సభ్యులు కోటేశ్వరరావు వెలగపూడి మాజీ సర్పంచ్ కోటపాటి వెంకటేశ్వర్లు ఆయా గ్రామాల సంబంధించిన రైతులు రైతు నాయకులు పాల్గొనడం జరిగింది.

# డిసెంబర్ 15 లోపు పంటల భీమా చేయించుకోవాలి
## వనమా రవికుమార్ మండల వ్యవసాయ అధికారి




ప్రకాశం జిల్లా బ్యూరో- చంద్ర (శుభోదయం న్యూస్): ఉదయగిరి నియోజకవర్గం వరికుంటపాడు మండలంలోని రామాపురం, వరికుంటపాడు గ్రామాలలో మంగళవారం నాడు వ్యవసాయ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పలు పంటలను సందర్శించి రైతులకు సూచనలు అందించడం జరిగినది. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి



మాట్లాడుతూ రైతులు రబీ సీజనులో సాగు చేయుచున్న శనగ, మినుము, పెసర, వేరుశెనగ పంటల భీమాను డిసెంబర్ 15 తేదీలోపు, అలాగే వరి పంట సాగు చేయు రైతులు డిసెంబర్ 31వ తేదీ లోపు మీసేవ కేంద్రం లేదా బ్యాంకుల నందు ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలి అని తెలిపారు. ఒక హెక్టారు శనగ పంటకు 140 రూపాయలు, మినుము పంటకు 95 రూపాయలు, పెసర పంటకు 90 రూపాయలు, వేరుశనగ పంటకు 150 రూపాయలు, వరి పంటకు 420 రూపాయలు చొప్పున ప్రీమియం ధర చెల్లించి రైతులు స్వచ్ఛందంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కొరకు పంటల బీమా నమోదు చేసుకోవాలి అని తెలిపారు. ఈ విధంగా ప్రీమియం చెల్లించిన రైతులకు పంటల దిగుబడిలో ఏమైనా నష్టం వాటిల్లినట్లయితే ఒక హెక్టారుకు శనగకు రూ.70,000, మినుముకు రూ.47,500, పెసరకు రూ.45,000, వేరుశనగకు రూ.75,000, వరికి రూ.1,05,000 భీమా చొప్పున నగదు వస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, పశు సంవర్ధక సహాయకులు సుబ్బారాయుడు, కిషోర్ మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.



# డిప్యూటీ కలెక్టర్, ఎలక్షన్
## అధికారి మండలంలోని బిఎల్వోస్తుతో సమావేశం





ఎర్రగొండపాలెం, మండలం రిపోర్టర్ - నారాయణ (శుభోదయం న్యూస్): యర్రగొండపాలెం మండల తహసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ కలెక్టర్ మరియు రిటర్నింగ్ ఆఫీసర్ ఎం సత్యనారాయణ గారి ఆధ్వర్యంలో మండలంలోని అన్ని బూతులలోని బి ఎల్ ఓస్ తో సమావేశం ఏర్పాటు చేసి ప్రతిబిఎల్ఓ మీ పరిధిలోకి వచ్చినటువంటి ఇంటి నెంబర్ కు సంబంధించి గాని చిరునామా గాని ఫోటో మార్పు గాని లేదా కొత్తగా ఓటర్ కు అప్లై చేసుకున్న వ్యక్తులకు సంబంధించిన విషయాలను వెంటనే ఆ ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు సేకరించి ఎవరి పరిధిలోని సమస్యలను వారు త్వరగా పరిష్కరించాలని తెలియజేశారు. ప్రతి బి ఎల్ ఓ వారికి కేటాయించిన పనిని తప్పకుండా పాటించాలని కోరారు. కార్యక్రమంలో తహసిల్దార్ అల్లరి బాలకిషోర్, ఎలక్షన్ డిటి సిద్ధం శెట్టి చంద్రశేఖర్ మరియు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు

# భక్తి ప్రపత్తులతో నాగుల చవితి వేడుకలు



రెంటచింతల, మండల రిపోర్టర్- శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): శివ కేశవులను అత్యంత భక్తి శ్రద్ధలతో పూజించే పవిత్ర కార్తీక మాసంలో శుక్లపక్షం చతుర్థి మంగళవారం నాడు నాగుల చవితి వేడుకలను మండలంలోని వివిధ ప్రాంతాల్లో భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. కార్తీక మాసంలో వచ్చే పవిత్ర పండగలలో నాగుల చవితి ఒకటి. శివుని మెడలో కంఠాభరణం గా, శ్రీమహావిష్ణువు శయనించే శేషతల్పం నాగులుగా హిందూ పురాణాలలో గాథలు ఉన్నాయి. నాగుల చవితి నాడు నాగేంద్రుని శివభావంతో అర్చిస్తే కాలసర్ప దోషాలు తొలగి సర్వ రోగాలు పోయి సౌభాగ్యవంతులవుతారని భక్తుల నమ్మకం. అలాగే నాగేంద్రుని పూజిస్తే వైవాహిక దాంపత్య దోషాలు,గర్భ దోషాలు తొలగి సంతాన ప్రాప్తి కలుగుతుందని విశ్వాసం. జీవరాశులను ఆరాధించే హైంధవ సంస్కృతిలో భాగంగా హిందువులు నాగులను దేవతలుగా భావించి పూజలు చేస్తారు.ఉదయాన్నే తలస్నానం ఆచరించి సమీపంలో ఉన్న నాగుల పుట్టల దగ్గరకు వెళ్లి పూజకు తీసుకువచ్చిన పసుపు, కుంకుమ పూలతో పుట్టలను అలంకరణ చేసి, ప్రమిదలు వెలిగించి, నైవేద్యం సమర్పించి పుట్టలో పాలు పోసి ప్రదక్షణలు చేశారు.నాగ దేవత అనుగ్రహం కోసం ఉపవాసాలు చేశారు. నాగుల చవితిని పురస్కరించుకొని శైవక్షేత్రం సత్రశాలలోని నాగమయ్య స్వామిని పలువురు భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. అలాగే రెంటచింతలలోని ఆంజనేయస్వామి మాన్యం, పాల్వాయి గ్రామాల్లో గల నాగేంద్ర స్వామి ఆలయాల్లో జరిగిన పూజ కార్యక్రమాల్లో భక్తుల విశేషంగా పాల్గొని నాగరాధనలు చేశారు.

# ఖాతాదారులందరూ పొదుపు అలవాటు చేసుకోవాలి
## బ్యాంక్ మేనేజర్ గంగాదేవి






సిద్ధవటం, మండలం విలేకరి - జాకీర్ హుస్సేన్ ( శుభోదయం న్యూస్): ఆర్థిక అక్షరస్యత లో భాగంగా మంగళవారం ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ సిద్ధ వటం శాఖ వారు మూలపల్లి లో ఆర్థిక అక్షరాస్యత అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ఖాతాదారులు అందరూ పొదుపు అలవాటు చేసుకోవాలని బ్యాంక్ మేనేజర్ గంగాదేవి తెలిపారు. బ్యాంక్ నందు గల వివిధ డిపాజిట్ పథకాల గురించి తెలియజేశారు. ప్రగతి త్రివేణి మరియు ప్రగతి కుబేర డిపాజిట్ పథకాల గురించి వివరించారు. కళాకారులు బ్యాంక్ లో గల వివిధ ఇన్సూరెన్స్ స్కీముల గురించి తెలియజేశారు. అందరూ మరియు పాలసీలు తీసుకోవాలని వాటి ఉపయోగాలు వివరించారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది,మెసెంజర్ సతీష్ పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాలలో
## రోడ్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యం : ప్రత్తిపాటి
### యడ్లపాడు మండలంలో
### రూ.22 లక్షలతో రోడ్ల నిర్మాణానికి శంఖు స్థాపన



చిలకలూరిపేట, పాలపర్తి శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్) : చిలకలూరిపేట నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా ఇది మంచి ప్రభుత్వమంటూ ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని, గ్రామీణ ప్రాంతాలలో రోడ్ల నిర్మాణానికి ప్రథమ ప్రాధాన్యమిస్తున్నామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఈ సందర్భంగా తెలిపారు.యడ్లపాడు మండలంలోని గుత్తావారిపాలెం, కారుచోల గ్రామాల్లో రూ.22 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి మంగళవారం శంఖు స్థాపన చేశారు. తొలుత ఆయా గ్రామాల్లోకి వచ్చిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గుంతలులేని రోడ్లను ప్రజలకు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.4500 కోట్లతో రోడ్లను, మౌలిక వసతులను ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంతాలను తీర్చుదిద్దుతున్నామని తెలియజేసారు.ఈ కార్యక్రమాన్ని సీఎం చంద్రబాబు నాయుడు గారు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని చెప్పారు. ప్రస్తుతం గ్రామాల్లో రోడ్లను చూస్తుంటే అభివృద్ధి 20 ఏళ్లు వెనక్కు వెళ్లినట్లు కనిపిస్తోందని, దీనికి గత వైసీపీ అసమర్థ పరిపాలనే కారణమని మండిపడ్డారు. కారుచోల, గుత్తావారిపాలెం గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ఆర్ అండ్ బీ అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి
## కృషి చేయాలని అధికారులకు ప్రత్తిపాటి ఆదేశాలు..



చిలకలూరిపేట, పాలపర్తి శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద ప్రతి గ్రామంలో పని దినాలను పెంచి, కేంద్ర ప్రభుత్వ నిధులను (మెటీరియల్ కాంపోనెంట్) పెద్ద ఎత్తున సాధించాలని అధికారులకు ప్రత్తిపాటి పుల్లారావు దిశా నిర్దేశనం చేశారు.ఏ.పి.ఓ లు మరియు టీ. ఏ లు పూర్తి స్థాయిలో గ్రామాలలో పని దినాలను కేటాయించడంలేదని ఫీల్డ్ అసిస్టెంట్ లు ప్రత్తిపాటి పుల్లారావు కి అందించిన ఫిర్యాదుల నేపథ్యంలో 3 మండలాలకు చెందిన ఎంపీడీవోలు, ఏ.పి.ఓ లు,టీ. ఏ లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో పేద వర్గాల ప్రజలకు పని దినాలను పెంచడం వల్ల,కేంద్ర ప్రభుత్వ నిధులను మెటీరియల్ కాంపొనెంట్ రూపంలో పెద్ద ఎత్తున పొంది, గ్రామాలలో మరింత అభివృద్ధిని సాధించాలని తెలియజేసారు.ఈ సమీక్షా సమావేశంలో 3 మండలాల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామేపల్లి సాయిబాబు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ప్రజల ప్రాణాలతో చెలగాటం అడిగితే సహించేది లేదు: ప్రత్తిపాటి



చిలకలూరిపేట, పాలపర్తి శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): యడ్లపాడు మండలంలోని వంకాయలపాడు, కారుచోల గ్రామాల మధ్య వున్న సబ్బుల ఫ్యాక్టరీ వల్ల రెండు గ్రామాలలో పలు వ్యాధులకు ప్రజలు గురి అవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఇటీవల జరిగిన గ్రీవెన్స్ లో శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావు ఈరోజు సదరు సబ్బుల ఫ్యాక్టరీని



పరిశీలించడం జరిగింది. సబ్బుల ఫ్యాక్టరీ వ్యర్థాల కారణంగా తీవ్ర దుర్వాసన రావటం, ఆ ఆయిల్ వల్ల చుట్టూ వున్న పంట పొలాలు దెబ్బ తినడమే కాకుండా,ఆ వ్యర్థ పదార్థాలు చెరువులో కలుస్తున్నాయని ,ఆ గ్రామాల ప్రజలు ప్రత్తిపాటి పుల్లారావు దృష్టి కి తీసుకొని వచ్చారు. ఆ ఫ్యాక్టరీని అంతా పరిశీలించిన అనంతరం యడ్లపాడు మండల తహశీల్దారును ఫ్యాక్టరీ యొక్క అనుమతులు గురించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫ్యాక్టరీని స్థాపించి 13 సంవత్సరాలు పూర్తి అయిందని అని ఫ్యాక్టరీ యజమాని ఈ సందర్భంగా తెలిపారు.ఈ పరిశ్రమకు సంబంధించిన ఆయా శాఖలు ద్వారా ఫాక్టరీని తనిఖీ చేయించి, సదరు ఫ్యాక్టరీ వల్ల ఎటువంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి అనే విషయాలపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించడం జరిగింది.

# సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయం



సిద్ధవటం మండలం విలేకరి జాకీర్ హుస్సేన్, ( శుభోదయం న్యూస్) : మండల పరిధిలోని మాధవరం వన్ మేజర్ గ్రామపంచాయతీలో నీ మగర్లోని మసీదులో వారి ఇంటి వాకిళ్ల ముందర ఉన్న డ్రైనేజీ కాలవలను ఎలా తొలగించుకోవాలి అనే చర్చ కార్యక్రమం జరిగింది. నియోజకవర్గ టిడిపి ముస్లిం మైనారిటీ అధ్యక్షులు డాక్టర్ నాగూర్ వీరభద్రుడు గారి చొరవతో మహబూబ్ నగర్ లోని పెద్దలు, గ్రామ ప్రజలు సంతకాల సేకరణ జరిపి పంచాయతీ ప్రెసిడెంట్ గారికి పంచాయతీ సెక్రటరీ సమక్షంలో డ్రైనేజ్ కాలవలను తొలగించమని వినతి పత్రం అందివ్వడం జరిగింది. పంచాయతీ ప్రెసిడెంట్ జానకి రామయ్య గారు స్పందిస్తూ గత ప్రభుత్వంలో పంచాయతీలకు ఫండ్స్ ఏమీ రాక అభివృద్ధి, పారిశుద్ధ కార్యక్రమాలు నిలబడిపోయాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీకి నిధులు జమకూరాయని అన్నారు. మీకు ఎటువంటి సహాయ సహకారాలకైనా కూటమి నాయకులతో కలిసి పని చేయటానికి గ్రామ ప్రెసిడెంట్ గా సిద్ధంగా ఉన్నానని తెలియజేశారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ముస్లిం మైనారిటీ అధ్యక్షులు డాక్టర్ వీరభద్రుడు గారు,గ్రామ పంచాయితీ ప్రెసిడెంట్ అవ్వారు జానకి రామయ్య గారు,గ్రామపంచాయతీ సెక్రటరీలు లక్ష్మీ నరసయ్య గారు, నాన్సీ గారు,టిడిపి గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి పెగడ హరి ప్రసాద్ గారు, టిడిపి బూత్ ఇంచార్జ్ లు చెన్నకేశవులు, కరమల్ల బాషా గార్లు, ఆ వార్డు మెంబర్ అవ్వారు అశోక్ గారు, ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్ గారు, టిడిపి యూత్ మామిళ్ళ మురళి, మహబూబ్ నగర్ గ్రామ పెద్దలు మౌలాలి, మహబూబ్ బాషా, ఖాసీమ్, మహమ్మద్ అలీ,మౌలా మరియు గ్రామ ప్రజలు,యూత్ పలువురు పాల్గొన్నారు.



# మార్కాపురం ఉప విద్య అధికారిగా బాధ్యతలు చేపట్టిన శామ్యూల్ జాన్

పుల్లలచెరువు, మండలరి పోర్టర్ - లక్ష్మణ్ (శుభోదయం న్యూస్ ): పుల్లలచెరువు మండలంలో మండలవిద్య అధికారిగా విధులు ఉన్న లోశామ్యూల్ జాన్ కు జిల్లా విద్య అధికారులు మార్కాపురం ఉప విద్యాశాఖ అధికారిగానియమితులు గా జేసి మంగళవారం బాధ్యతలు చేపట్టిన్నందున మండలం లో ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేసిన మట్టే బ్రదర్స్



లింగసముద్రం రిపోర్టర్ కే సురేష్ ( శుభోదయం న్యూస్):లింగసముద్రం మండల కేంద్రమైన లింగసముద్రం పంచాయతీలోని జంపాలవారిపాలెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్సిల్,పెన్నులు,భల్పాలు పంపిణీ చేశారు. మంగళవారం వైస్సార్సీపీ లింగసముద్రం గ్రామ పార్టీ మాజీ అధ్యక్షులు,మాలకొండ మాజీ ట్రస్ట్ బోర్డు మెంబర్ జంపాలవారిపాలెం గ్రామానికి చెందిన మట్టే నాగేశ్వరావు మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు వేణుగోపాల్, మాల్యాద్రి,నరసింహం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నాగేశ్వరరావు మనవళ్లు గుణచరణ్,మహీధర్,ధీరజ్ పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



బిట్రగుంట (శుభోదయం న్యూస్) : బోగోలుమండలంలోని పలుప్రాంతాలలో మంగళవారం తెల్లవారుజామునుండి మహిళలునాగేంద్రస్వామి పుట్టలవద్ద భక్తిశ్రద్ధలతోపూజలాచరించారు. తెల్లవారుజామున



తలస్నానమాచరించి పుట్టలవద్ద నీళ్లుచల్లారు. అనంతరంనాగేంద్ర స్వామికిఇష్టమైన చలిమిడి, సజ్జలు, కోడిగుడ్లు, అరటిపండ్లు, పాలువంటిపదార్థాలను నైవేద్యాలుగాసమర్పించారు. నాగులచవితిపండుగను పురస్కరించుకొని మండలంలోని పలుగ్రామాలలోమహిళలుపెద్ద సంఖ్యలో పూజలాచరించారు. గ్రామాలలో నాగులచవితి సందర్భంగా పండుగశోభ సంతరించుకుంది.

# మొగిలిచర్ల పెంట్రాల సేవా కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం:



లింగసముద్రం రిపోర్టర్ కే సురేష్ (శుభోదయం న్యూస్): ఈ కార్యక్రమంలో పశువుల డాక్టర్ పి వంశీ మాట్లాడుతూ నట్టల నివారణకు డి వార్మింగ్ చేసుకోవాలని సకాలంలో వ్యాధులు నివారణకు టీకాల వేయించుకొని తెలియజేశారు. వ్యవసాయ అధికారి అబ్రహం లింకన్ మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే కొనుగోలు చేయవలసిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో సురేష్ మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసుకోవలసిందిగా తెలిపారు ఈ కార్యక్రమంలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ రమణమ్మ వ్యవసాయ సహాయకులు మరియు గ్రామస్తులు అధికారులు పాల్గొన్నారు.


# జొన్నగిరిలో టిడిపి సభ్యత్వాలు.. టిడిపి మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు....



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్): తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం పత్తికొండ శాసనసభ్యులు కేఈ.శ్యామ్ కుమార్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వాల నమోదు కార్యక్రమం అన్ని గ్రామాలలో చేపట్టడం జరుగుతుందని టీడీపీ మండల కమిటీ అధ్యక్షులు తిరుపాల్ నాయుడు అన్నారు.మంగళవారం మండలం పరిధిలోని జొన్నగిరి లో టీడీపీ సభ్యత్వ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గురుస్వామి, టీడీపీ నాయకులు బాలన్న, విద్యా కమిటీ చేర్మెన్ మిద్దె రవి మాట్లాడుతూ టిడిపి హయాంలోనే అన్ని వర్గాల వారికి న్యాయం చేకూరుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ టిడిపి సభ్యత్వాన్ని తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో సర్పంచ్ ఓబులేసు, కృష్ణ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కదిలిన మారెళ్ల వాసులు.. చిన్నారులుకు అండగా నిలుద్దాం..

## మారెళ్ళ యమ్మే రాజశేఖర్ రెడ్డి..



తుగ్గలి, మండల రిపోర్టర్ మాధవ్ (శుభోదయం న్యూస్): కర్నూలు జిల్లా తుగ్గలి మండలం మారెళ్ళ గ్రామంలో బోయ ఆంజనేయులు 21/2/ 2021 తేదీన మరణించడం జరిగింది.అదేవిదంగా అయన భార్య బోయలక్ష్మి 20 /10/ 2024 తేదీన మరణించడం జరిగింది. వీరిద్దరు కు సంతానం ముగ్గురు ఆడపిల్లలు పెద్ద కుమార్తె బోయ జయ శ్రీ కు 12 సంవత్సరములు, రెండవ కుమార్తె అంకిత కు 8 సంవత్సరములు, మూడవ కుమార్తె బోయ ఉషా శ్రీ కు 4 సంవత్సరాలు గలరు. ఈ ముగ్గురు చిన్నారులు తల్లిదండ్రులు లేక అనాథలు అయినటువంటి పిల్లలకు యమ్మే రాజశేఖర్ రెడ్డి కుమారుడు యామ్మే శ్రీనివాస్ రెడ్డి సహకారంతో పిల్లలకు రు.20,000 రూపాయలు చెక్కు ఎమ్మే రాజశేఖర్ రెడ్డి గారి చేతుల మీదగా పిల్లల సంరక్షణ కోసం ఇవ్వడం జరిగింది . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామం నుండి ఈ విధంగానే స్పందించాలని ఈ చిన్నారులకు అండగా నిలిచాలని తల్లిదండ్రులు లేని లోటు తీర్చాలని ప్రతి ఒక్కరు ముందుకు రావాలని కోరుతున్నాం అని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఈ మారెళ్ళ వాల్మీకి అంజి, హొసూర్ రామచంద్ర, మీసేవ రాముడు, దేవరఇంటి వెంకటరాముడు, పులగం గణ మద్దిలేటి, పందికుంట ఆంజనేయులు, నల్ల గోవిందు , బల్ల వెంకటేష్, చిన్నస్వామి శ్రీను పుండుకూర రంగరాజు తదితరులు పాల్గొన్నారు...సహాయం అందించే వారు.ఈ అనాథ పిల్లలకు సహాయం అందించే వాళ్ళు 9949081540 ఈ నెంబర్ ద్వారా సమాచారం తీసుకుని గ్రామానికి వచ్చి చిన్నారులకు ఆర్థికంగా అన్ని విధాలుగా సహాయం చేస్తారని గ్రామస్తులు కోరారు.

# తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు డైరెక్టర్ ను కలిసిన అతికారి కృష్ణ



సిద్ధవటం, మండలం విలేకరి జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్): జనసేన పార్టీ నుండి నూతనంగా ఎన్నికైన తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు డైరెక్టర్లయిన శ్రీమతి అను గోలు రంగశ్రీ మరియు శ్రీ బుంగనూరు మహేందర్ రెడ్డి గారిని శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో తిరుపతిలో ఘనంగా సత్కరించిన రాజంపేట జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు అతికారి కృష్ణ...

# ఘనంగా నాగుల చవితి పండగ



బుచ్చియ్య పేట మండల రిపోర్టర్ జి శ్రీను (శుభోదయం న్యూస్): మండలంలోని బుచ్చయ్యపేట సీతయ్యపేట పెదపూడి రాజాం తురకలపూడి చింతపాక పెదపూడి పిపి అగ్రహారం ఎల్ బి పి అగ్రహారం వడ్డాది తదితర గ్రామాలలో నాగుల చవితి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు దూర ప్రాంతాల్లో స్థిరపడి సొంత గ్రామాలకు కుటుంభం సభ్యులతో పుట్టలో పాలు వేసే కార్యక్రమం ఆనందంగా నిర్వహించుకున్నారు. గ్రామాలలో ఆధ్యాత్మిక సభ వెలువేరిసింది.

# ఇంటర్ విద్యార్థుల అవగాహన సదస్సులో కె ఎల్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు





స్టేట్ బ్యూరో కోటేశ్వరరావు(శుభోదయం న్యూస్):నిర్ణయాత్మక ఆలోచనల ద్వారానే ఉజ్వల భవిష్యత్ ఇంటర్ విద్యార్థుల అవగాహన సదస్సులో కె ఎల్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు పాల్గొన్నారు.విద్యార్థుల జీవితంలో ఇంటర్ విద్యా దశ అత్యంత కీలకమని ఈ సమయంలో తీసుకునే నిర్ణయాత్మకమైన ఆలోచన వారి భవిష్యత్ ను శిఖరాగ్ర స్థాయికి తీసుకుని వెళ్తుందని కె ఎల్ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు పేర్కొన్నారు. గూడవల్లిలోని నారాయణ కళాశాల వైష్ణవి భవన్ లో



ఇంటర్ తరువాత కోర్సులు, భవిష్యత్ అంశాలపై మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇంటర్ తరువాత ఎంచుకునే కోర్సులు జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తాయని అందువల్ల తొందరపాటు, ఆవేశ పూరిత నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్ ఉండదని అన్నారు. ఉన్నత విద్యా రంగంలో ప్రస్తుతం ఎన్నో కోర్సులు అందుబాటులో ఉన్నాయని, అలాగే తెలివైన, నైపుణ్యం ఉన్న విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు లక్షల్లో జీతాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాయని అన్నారు. ఇంటర్ తరువాత తీసుకునే కోర్సుతో పాటు కళాశాల ఎంపిక కూడా అంతే అవసరమని డాక్టర్ శ్రీనివాస్ స్పష్టం చేశారు. తల్లి తండ్రుల ఆశయాల సాధనకు, దేశాభివృద్ధికి యువత అత్యుత్తమ మార్గాల్లో నడవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల డీన్ సి. హెచ్. శైలజ, ఏ జి ఎం మోహన కృష్ణ మాట్లాడుతూ ఉన్నత భవిష్యత్ ను లక్ష్యంగా పెట్టుకుని ఇష్టంగా చదువుకోవాలని, అలాగే వినూత్న ఆలోచనలు, సృజనాత్మక దృక్పథం విద్యార్థుల్లో ఉండాలని సూచించారు. ఒత్తిడి లేకుండా పరీక్షల్లో విజయం సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కె ఎల్ యూనివర్సిటీ అసిస్టెంట్ డైరెక్టర్ బొబ్బిలి సత్యనారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# వైద్యశాఖ అధికారికి వినతి పత్రం సమర్పించిన 104 సిబ్బంది.....




సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):తమ డిమాండ్లు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సింగరాయకొండ మండల 104 సిబ్బంది సింగరాయకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నాన్నం వంశీధర్ గారికి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ తమకి 3 నెలలు గా వేతనాలు ఇవ్వలేదు అని తమ కుటుంబాలను పోషించటం చాక కష్టం అవుతుంది అని వాపోయారు.104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రము ద్వారా కేవలము 50 వేలు రూపాయల ఖర్చు తో నిర్వహించి ప్రజా దనము వృధాకాకుండా చూడాలి అని 2020 తరువాత విధుల్లో చేరిన డ్రైవర్ మరియు డి.ఈ.ఓ కు జి.ఓ 7 ద్వారా వేతనాలు ఇవ్వాలని అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పి. యఫ్ తిరిగి చెల్లించాలి అని 74 మంది సీనియర్ డ్రైవర్లకు స్లాబ్ అమలు చెయ్యాలి అని డి. యస్సి ద్వారా నియమితులు అయిన సీనియర్ డ్రైవర్ లను కాంట్రాక్టు లో పెట్టాలి అని ఉద్యోగులకు ఇన్సూరెన్స్ చేయించాలి అని ఉద్యోగులకు యాజమాన్యం నుండి రావలసిన ఇతర బకాయిలు చెల్లించే విదంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని ఉద్యోగులకు న్యాయం చెయ్యాలి అని తెలిపారు.ఈ కార్యక్రమం లో 104 సంఘ ప్రకాశం జిల్లా కన్వీనర్ పైలట్ ఆడకా శ్రీకాంత్ గుంతోటి శ్వేతా పాల్గొన్నారు

## ప్రతీ కార్మికుడికి ఈ శ్రమ కార్డ్ ప్రయోజనాలు తెలుసుకోవాలి...!

లేబర్ ఆఫీసర్ సుజాత..



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్): ప్రతి కార్మికుడికి ఈ శ్రమ కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని కందుకూరు లేబర్ ఆఫీసర్ సుజాత అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఊళ్ళపాలెం గ్రామంలో కూలీ కార్మికులతో ఆమె మాట్లాడారు. కూలి పనులకు వెళ్లే కార్మికులు పనులకు వెళ్లిన చోట ఏదైనా ప్రమాదాలు వాటిల్లితే ఈ శ్రమ లేబర్ కార్డు కుటుంబ సభ్యులకు అండగా ఉంటుందని వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు తప్ప ప్రతి ఒక్కరూ దీనికి అర్హులని తెలిపారు. ఈ సందర్భంలో గ్రామ తెదేపా నాయకులు కానాల బాలాజీ, నూతలపాటి చైతన్య తదు ఇతరులు ఉన్నారు.

## సిద్ధవటం మండలం సమస్యలు మంత్రి దృష్టికి తీసుకువెళ్లిన తుర్ర ప్రతాప్ నాయుడు



సిద్ధవటం, మండలం విలేకరి - జాకీర్ హుస్సేన్ (శుభోదయం న్యూస్): సిద్ధవటం మండల సమస్యలను కడప జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు సవిత గారిని కడప కలెక్టరేట్లో పెద్దపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ ప్రతినిధి తుర్ర ప్రతాప్ నాయుడు పలు అభివృద్ధి పనులపై వినతి పత్ర అందజేశారు, సిద్ధవటం మండలంలోని పెద్దపల్లి గ్రామపంచాయతీ పై దృష్టి సారించాలని తుర్ర ప్రతాప్ నాయుడు మంత్రిని కోరారు మంత్రి సవితాను వినతి పత్రం అందజేస్తున్న తుర్ర ప్రతాప్ నాయుడు.

## గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం



నల్లచెరువు, మండల రిపోర్టర్ - బావాజీ (శుభోదయం న్యూస్ ) : మండల పరిధిలోని తవలమ్మరి, దిగుపల్లి గ్రామాలలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి భారతి పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలలో రైతులకు రబీ సాగు2024 పంటల బీమా గురించి వివరించారు. ఇందులో భాగంగా పంట బీమా కొరకు వేరుశనగ పంటకు రూ. 480,వరి పంట ఎకరాకు రూ. 630,టమోటా ఎకరాకు రూ. 1600 చొప్పున బ్యాంకు,మీసేవ లేదా తమ పరిధిలోని సచివాలయాల నందు డిసెంబర్ 15 లోపు చెల్లించవలసి ఉంటుందన్నారు. రబీలో వేరుశనగ వేసే రైతులు తప్పకుండా విత్తన శుద్ధి క్లోఫ్రీడ్ 1 ఎం.ఎల్ కిలో విత్తనాలకు,డైతెన్ ఏం45తో కిలో విత్తనానికి మూడు గ్రాములుగా కలిపి వాడుకోవాలన్నారు. పూత పూసే దశలో జిప్సం 200 కిలోలు ఎకరాకు వేస్తే విత్తనాల నాణ్యత పెరుగుతుందన్నారు. వరి పంటలో సుడిదోమ నివారణ చర్యలు వివరించారు. అనంతరం పశువులకు టీకాలు వాడే విధానం, ఇతర రోగాల గురించి పశు వైద్య అధికారి సాయినాథ్ రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ జహీర్,సాయినాథ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పాండురంగస్వామి దేవాలయ నిర్మాణమునకు 10 లక్షలు విరాళం



ధర్మవరం, నియోజకవర్గం ఇంచార్జ్ - గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్): పట్టణంలోని పి ఆర్ టి సర్కిల్ లో గల శ్రీ పాండురంగ స్వామి దేవాలయంలో నూతన నిర్మాణ కట్టడాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త, లయన్స్ క్లబ్ సేవకులు, శ్రీనివాస నగర్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి సంఘం అధ్యక్షుడు చెన్నం శెట్టి జగదీష్ పది లక్షల రూపాయల విరాళమును ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా పాండురంగ స్వామి ఆలయ కమిటీ వారు చెన్న%శీ% శెట్టి జగదీష్ ప్రసాద్ కుటుంబానికి ప్రత్యేకంగా కృతజ్ఞతలను తెలియజేశారు. అనంతరం చెన్నం శెట్టి జగదీష్ మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తనకున్న ఆదాయంలో కొంత దైవ కార్యాలకు ఉపయోగించినప్పుడే జన్మ సార్థకమవుతుందని తెలిపారు. మానవ సేవ చేయడంలోనూ ఒక మంచి గుర్తింపు ఉందని, అదేవిధంగా దైవ సేవలో ఏదో రూపేనా విరాళం ఇవ్వడం నాకు సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. ఆలయ నిర్మాణానికి తన వంతుగా ఇచ్చానని, ఇంకను ఆలయ నిర్మాణానికి డబ్బు చాలా అవసరం ఉన్నందున, దాతలు స్పందించి ఆలయ నిర్మాణమునకు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు.

## దోమల నివారణకు గేంబుజియ చేపలు దోహదపడతాయి

సి. హెచ్. ఓ రామచంద్ర రెడ్డి



నల్లచెరువు, మండల రిపోర్టర్ - బావాజీ (శుభోదయం న్యూస్ ):దోమల నివారణకు గేంబుజియ చేపలు ఎంతగానో దోహదపడతాయని సి. హెచ్. ఓ రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లి దాబా హోటల్స్ సమీపంలో రెండు దిగుడు బావులలో దోమల నివారణకు కదిరి ఏరియా మలేరియా యూనిట్ సిబ్బంది గేంబుజియ చేపలను వదిలినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి కుంటలలో ఉన్న దోమల లార్వాలను మొత్తం ఈ గేంబుజియ చేపలు తింటాయని తెలిపారు. దీని ద్వారా దోమల వృద్ధి కాకుండా ఉంటుందని పేర్కొన్నారు. మలేరియా డెంగ్యూ చికెన్ గునియా వంటి జ్వరాల బారిన పడకుండా దోమలను ఈ విధంగా నివారించవచ్చు తెలిపారు పై కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారులు రామానుజులు,మహబూబ్ బాషా, ఏఎన్ఎం షరీఫా, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి ,ఆశ కార్యకర్తలు ఉమాదేవి, గ్రామస్తులు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సభకు వెళ్ళిన..కాంగ్రెస్ నాయకులు



పాపన్నపేట, (శుభోదయం న్యూస్) : పాపన్నపేట మండలం నుండి రాహుల్ గాంధీ సభకు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ కి మంగళవారం తరలి వెళ్లారు. అగ్రనేత కు హస్తం శ్రేణులు స్వాగతంపలికారు. ఈసందర్భంగా పార్టీ నాయకులు లింగంపేట నరేందర్ గౌడ్,ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు ముశెట్టి కిష్టయ్య,బాబర్ పటేల్,ప్రవీణ్ గౌడ్,టప్పా రాములు తదితరులు ఉన్నారు.

## టిపిటిఎఫ్ నూతన మండల శాఖ ఎన్నిక





పాపన్నపేట, (శుభోదయం న్యూస్ ):తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ పాపన్నపేట మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఎల్లాపూర్ గ్రామ ప్రాథమిక ఉన్నత పాఠశాల జరిగింది. ఈసమావేశానికి బాలరాజు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా రామ్ కిషన్,మాజీ రాష్ట్ర కార్యదర్శి హాజరయ్యారు .ఈసందర్భంగా రాంకిషన్ మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులన్నీ ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పిఆర్ సి ని ప్రకటించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల అధికారులుగా నజిరుద్దీన్,గోపాల్ పరిశీలకులుగా,హీరాలాల్ రాష్ట్ర కౌన్సిలర్ గా వ్యవహరించారు. కాగా కొత్త శాఖను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. పాపన్నపేట మండల అధ్యక్షుడిగా ఇ.బాలరాజు,ప్రధాన కార్యదర్శిగా ఎం.రమేష్,ఉపాధ్యక్షులు గా 1)గన్ను 2)ఎల్ కిషన్ 3)అనిల్ కుమార్ 4)లక్ష్మి 5)షహీన్ బేగం కార్యదర్శులుగా.. 1)జయవర్ధన్ 2)నవీన్ కుమార్ 3)కవిత 4)ముజీబ్ 5) విశ్వనాథ్ ఎన్నిక అయ్యారు. జిల్లా కౌన్సిలర్ లు 1)విక్రమ్ గౌడ్ 2)సుబ్బారావు 3)వెంకటేశం 4)మంజుల 5)బాబు 6)శ్రీనివాస్ 7)లోక్య నాయక్ లు ఉన్నారు.

## నేటి నుంచి రామగుండం పట్టణంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం

పెద్దపెల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఇంచార్జ్ కమిషనర్ అరుణశ్రీ




రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి,(శుభోదయం న్యూస్): బుధవారం నుండి సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి,రాజకీయ ,కుల సర్వే ( సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్యుమరేటర్లు, సూపర్ వైజర్లకు ఎన్ టి పి సి మిలీనియం హాల్లో మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ (ఎఫ్ ఎ సి ) అరుణ శ్రీ, రామగుండం మండల తహసీల్దార్ కుమార స్వామి, రామగుండం నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమీషనర్ రాజలింగు, మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య , ఎ సి పి శ్రీధర్ ప్రసాద్, టి పి ఎస్ నవీన్ సూపరింటెండెంట్ ఆ%శీ% జనేయులు, సీనియర్ అసిస్టెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొనగా, డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్ లింగారెడ్డి శిక్షణ ఇచ్చారు. కాగా రేపటి నుండి ఇంటింటికి వస్తున్న సిబ్బందికి పూర్తి వివరాలు అందించి సహకరించాలని గృహస్థులను పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ (ఎఫ్ ఎ సి ) అరుణ శ్రీ కోరారు. ఆధార్, ఆహార భద్రతా కార్డు, ధరణి తదితర వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

## ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చిన సందర్భంలో రామగుండం తెలుగు తమ్ముళ్ల సంబరాలు



గోదావరిఖని టౌన్ రిపోర్టర్-సురేష్,(శుభోదయం న్యూస్ ):ఆంధ్రప్రదేశ్ లో తెలుగుదేశం అధికారంలో కి రావడం ఈ రోజు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా టీ ఎన్ టీ యూ సి, కార్యాలయం లో తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి కే నిమ్మకాయల ఏడుకొండలు,ఆదేశానుసారం,టీ ఎన్ ఎస్ ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బెక్కం వీరేందర్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా




పెద్దపల్లి పార్లమెంట్ టీ ఎన్ టీ యూ సి, అధ్యక్షులు ముదుగంటి దామోదర్ రెడ్డి, బాణాసంచా కాల్చి సంబురాలు ప్రారంభించారు, అనంతరం పెగడపల్లి రాజనర్సు స్వీట్లు పంపిణీ చేయడం, తెలుగుదేశం నాయకులు మహిళా నాయకురాళ్లు కార్యకర్తలు అందరు ప్రమాణ స్వికరా మహోత్సవానికి సంబురాలు ఘనంగా నిర్వహించడం జరిగింది,తెలుగుదేశాన్ని మళ్ళీ అధికారంలోకి తెచ్చిన ఆంధ్ర ప్రజలకు తెలంగాణ తెలుగుదేశం నాయకులు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. అలాగే తెలంగాణ లో కుడా రాబోవు రోజుల్లో తెలుగుదేశానికి పూర్వవైభవం తీసుకురావాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు,ఈ కార్యక్రమంలో గుండబోయిన ఓదెలు ,నరెడ్డి స్వరాజ్యం, బరిగేలా కళావతి, సుందిల్లా స్వామి, బండారి స్రవంతి, కాసిపేట మల్లీశ్వరి, కే మనమ్మ, ఏ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ..



రేగొండ మండలం రిపోర్టర్:-మంతెన సురేష్(శుభోదయం న్యూస్ ): రేగొండ మండలంలో మాజీ స్పీకర్ మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మంగళవారం పర్యటించి పలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండలంలోని దామరంచపల్లి గ్రామానికి చెందిన టిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు కొత్త కృష్ణారెడ్డి తల్లి అమృతమ్మ ఇటీవల మృతి చెందగా సిరికొండ వారి స్వగ్రామానికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షులు కృష్ణారెడ్డిని తల్లి మృతి పట్ల వివరాలను అడిగి తెలుసుకుని సంతాపం వెలిబుచ్చారు. అనంతరం మండల కేంద్రంలోని టిఆర్ఎస్ అభిమాని కందకట్ల రాజు తండ్రి సురేందర్ అనారోగ్య రీత్యా ఇంట్లో ఉండగా వారిని పరామర్శించి ధైర్యంగా ఉండాలని మాజీ స్పీకర్ సిరికొండ మనోధైర్యం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మాజీ సర్పంచ్, లెంకలరాజిరెడ్డి మాజీ ఎంపీపీ ఈర్ల సదానందం, మాజీ సింగిల్ విండో చైర్మన్ గోపు బిక్షపతి, మాజీ సర్పంచి జూపాక నిల నీలాంబరం,రాజు,యూత్ నాయకులు బింగి బిక్షపతి, దొపతి సమ్మిరెడ్డి, ముద్దమల్ల సమ్మయ్య, పసుల అశోక్, రావుల తిరుపతి, జూపాక శ్రీనివాస్, కునూరు శోభన్ గౌడ్, మాజీ ఎంపీటీసీలు, సిరికొండ అభిమానులు, టిఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు తదితరులు ఉన్నారు. కాగా మాజీ స్పీకర్ మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మండలంలోని పలువురు కార్యకర్తలతో మాట్లాడుతూ కుటుంబ సమస్యలను తెలుసుకొని, పార్టీని మరింత అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ తమ తమ పనులలో నిమగ్నమై కుటుంబాలను కూడా చూస్తూ ఉండాలని ఆయన కార్యకర్తలకు నాయకులకు ప్రజాప్రతినిధులకు సూచించారు.

## అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించాలన్నదే లక్ష్యం టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్



ధర్మవరం, నియోజకవర్గం ఇంచార్జ్ - గోవర్ధన్ రెడ్డి (శుభోదయం న్యూస్):నీరు ఉంటేనే రైతులు గ్రామాలు సస్యశ్యామలంగా ఉంటాయని, ధర్మవరం నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలకు సాగునీరు అందించాలన్నదే ఎన్డీఏ ప్రభుత్వం యొక్క లక్ష్యము అని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు రావులచెరువు గ్రామానికి నీటిని విడుదల చేసి, రైతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో హార్టికల్చర్ హక్కుగా మార్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు యొక్క లక్ష్యం అని, ధర్మవరం చెరువు పూర్తిస్థాయిలో నిండి మరువ పారుతున్న నేపథ్యంలోనే రావులచెరువు గ్రామానికి నీరుని విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ఏడవ మరువ వద్ద గంగపూజ చేసి తూములు ఎత్తి రావులచెరువుకు నీరు విడుదల చేశారు. దీంతో ఆ ప్రాంత రైతాంగం అంతా పరిటాల శ్రీరామ్ కు కృతజ్ఞతలు తెలిపారు. అక్కడ ఒక పండుగ వాతావరణం కనిపించింది. ప్రస్తుతం రావులచెరువుకి నీరు విడుదల చేశామని. ఈ మార్గంలో మల్లాకాల్వ, సి. బత్తలపల్లి ప్రాంతాల్లో కూడా భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉందని వారు అభిప్రాయపడ్డారు. ధర్మవరం చెరువు నుంచి వీలైనన్ని ఎక్కువ ప్రాంతాలకు సాగునీరు అందించే విధంగా అధికారులతో చర్చిస్తున్నామన్నారు. గతంలో నిర్జీవంగా మారిన సాగునీటి వనరులకు ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో జీవం పోస్తున్నామని వివరించారు. 2014-19 సమయంలో పెద్ద ఎత్తున డ్రిప్పు, స్ప్రింక్లర్లు ఇచ్చి రైతులను ప్రోత్సహించారన్నారు. గత ఐదేళ్లలో ఇలాంటి పరిస్థితి ఎక్కడా లేదన్నారు. ఇప్పుడు మరోసారి డ్రిప్పు, స్ప్రింక్లర్లు సబ్సిడీతో అందిస్తున్నారని రైతులు దీనిని సద్వినియోగం చేసుకొని నీటిని ఆదా చేయాలని శ్రీరామ్ కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## యుటిఎఫ్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభలు



నల్లచెరువు, మండల రిపోర్టర్ - బావాజీ (శుభోదయం న్యూస్): ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవ జిల్లా మహాసభల పోస్టులను మంగళవారం మండల విద్యాధికారి తిరుపాల్ నాయక్ ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆవిర్భావించి 50 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా శ్రీ సత్య సాయి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈనెల 10న కదిరి జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాల నందు జరిగే యుటిఎఫ్ స్వర్ణోత్సవన మహా సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా నల్లచెరువు మండలం గౌరవ అధ్యక్షులు జి ఆనంద్,అధ్యక్షులు షేక్ నజీర్, ప్రధాన కార్యదర్శి రవివర్ధన్ రెడ్డి ,ఏం ఆజం భాష, యుగంధర్, ఇర్ఫాన్ భాష, మధుసూదన్ రావు మండల కార్యవర్గ సభ్యులు రమేష్ స్థానిక నల్లచెరువు మండల వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి తిరుపాల్ నాయక్ కు ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ గత 50 సంవత్సరాలనుండి ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పట్ల యుటిఎఫ్ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. తమ హక్కులకై బాధ్యతాయుతంగా పోరాడుతొందన్నారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు పాటుపడుతూ,ముఖ్యంగా సమాజం ఇబ్బందికర పరిస్థులున్నప్పుడు, సమాజానికి అండగా నిలబడుత్ కరోనా సమయంలో లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రజలకు అండగా ఉండడం హర్షించదగ్గ విషయమన్నారు. ప్రతి సంవత్సరం 10 వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఉపయోగపడేవిధంగా ఎస్ ఎస్ సి మోడల్ పేపర్స్ ను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉపాధ్యాయ సమస్యల పట్ల పోరాట పటిమను చూపాలని దానితో పాటు ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు యుటిఎఫ్ పాటుపడాలని, ఉపాధ్యాయులందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## మినుము పెసర పంటలపై రైతులకు అవగాహన సదస్సు



పొదలకూరు, (శభోదయం న్యూస్):నెల్లూరు జిల్లా పొదలకూరు మండలంలోని పులికొల్లు పార్లపల్లి గ్రామాలలో మంగళవారం నాడు పొదలకూరు మండల వ్యవసాయ అధికారి ఏ వాసు ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ మాసంలో పెసర మినుము పంటల సాగుపై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. విత్తనాలు విత్తిన తర్వాత, 20 25 రోజుల కాలంలో నేలలో తేమ శాతాన్ని గమనించి ఎకరానికి 200 ఇమాజిత్ ఫిల్ ద్రావణాన్ని పిచికారి చేసినట్లయితే,గడ్డి జాతి కలుపు మొక్కలను అరికట్టవచ్చునన్నారు. అంతేకాకుండా సస్యరక్షణ చర్యలలో భాగంగా,రసం పీల్చే పురుగులు తామర పురుగులు పేను బంక,వంటి వాటికి చెట్ల వాతావరణం అనుకూలం కావున, వాటితోపాటు తెల్ల దోమ నివారణకు కూడా 1.5 ట్రైసోఫాస్ లేదా ఎసిఫేట్ 1.5 లేదా ఎసిటమిప్రేడ్ 0.2 గ్రామ్స్ తయామితాక్షం 2 గ్రామ్స్ లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. 1.0గ్రా ఎసిపేట్ లేదా 1.5 %ఎశ్రీ% పిప్రోనిల్ లేదా, 2 ఎంఎల్ డైమితోఏట్ లేదా 0.2 గ్రా డైమితోఏట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి అన్నారు. చిత్తపురుగులాకు దశలో రెండో ఆకు దశ నుంచి ఉధృతి ఎక్కువగా ఉంటుంది కాబట్టి, నివారణకు 2.5 క్లోరిఫైరీఫాస్ లేదా1.0 గ్రా ఎసిపెట్ లేదా 1.6 ఎంఎల్ మోనోక్రోటోఫాస్ లీటర్ నీటి కలిపి పిచికారి చేయడం ద్వారా నివారించుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్ లో
## "చిత్ర కళా పెన్నిధి" అవార్డు పొందిన చిప్పకుర్తి శ్రీనివాస్



మంచిర్యాల జిల్లా, (శుభోదయం న్యూస్): ఒంగోలులో అది, సోమవారాల్లో రెండ్రోజుల పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లోని చిత్రకారులను ఆహ్వానిస్తూ ప్రముఖ చిత్రకారుడు కళా యజ్ఞ ఏలూరి శేషబ్రహ్మం, సృష్టి అకాడమీ తిమ్మిరి రవీంద్ర, నెస్ట్ మేకేర్స్ భూపాల్ రెడ్డి సంయుక్తంగా నిర్వహించిన ఒంగోలు ఆర్ట్ ఫెస్ట్ - "ప్రాచీన భారత్" ఆర్ట్ ఎగ్జిబిషన్లో మంచిర్యాల కు చెందిన ప్రముఖ చిత్రకారుడు, చిప్పకుర్తి ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్ చిప్పకుర్తి శ్రీనివాస్ వేసిన పేయింటింగ్ కి "చిత్ర కళా పెన్నిధి" అవార్డును ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు గారి చేతుల మీదగా అందజేయడం జరిగింది. దాదాపు 150 మంది ప్రముఖ చిత్రకారులు పాల్గొనగా మంచిర్యాల నుండి బహుమతికి ఎంపికైన శ్రీనివాస్ ని కళా యజ్ఞ శేషబ్రహ్మం అభినందించి అవార్డు తో పాటు శాలువా జ్ఞాపిక ను అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు మూడు రాష్ట్రాలకు చెందిన హైపర్ రియాలిస్టిక్ చిత్రకారులు సుబ్బు ఆర్వీ, విజయ్ , అబ్దుల్ రాయ్ బోస్, పంతంగి శ్రీనివాస్ ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.. వీరితో పాటు తెలుగు రాష్ట్రాల నుండి 150 పైగా చిత్రకారులు పాల్గొనగా అందరినీ ఘనంగా సన్మానించారు... చిత్రకారులు సాగంటి మంజుల, యాదగిరి, దిలీప్, అంజి రాకేష్, నరేష్ తదితరులు శ్రీనివాస్ కు అభినందనలు తెలిపారు...

## నాగదేవత చిత్రాన్ని రూపొందించిన రామకోటి రామరాజు
## కార్తీకమాసంలోని నాగులచవితి చాలా శ్రేష్ఠమైనది

భక్తితో నాగదేవత చిత్రాన్ని చిత్రించిన రామకోటి రామరాజు




హైదరాబాద్, (శుభోదయం న్యూస్): కార్తీకమాసంలోని నాగులచవితి పురస్కరించుకొని నాగదేవత అద్భుత చిత్రాన్ని అవాలను ఉపయోగించి అద్భుతంగా రూపొందించి మంగళవారం నాడు రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించారు సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తిరత్న, కళారత్న అవార్డు గ్రహీత రామకోటి రామరాజు ఈ సందర్భంగా మాట్లాడుతూ దీపారాధనకు శ్రేష్టమైన మాసం కార్తీక మాసం అన్నారు. అందులో నాగులచవితి రావడం, మహిళందరు కూడ పుట్టకు పాలు పోసి తమ తమ మొక్కులను చెల్లించు కుంటారన్నారు. అందరూ కూడ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని వేడుకుంటారు.

## రాష్ట్ర చరిత్రలో కుల గణన చేయడం హర్షనీయం
## మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్




కామారెడ్డి జిల్లా ప్రతినిధి పోచయ్య (శుభోదయం న్యూస్ ):- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రేపటి నుంచి కులగనన చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావడానికి స్వాగతిస్తున్నామని, రాష్ట్ర చరిత్రలోనే కుల గణన సువర్ణ అధ్యయనమని ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1931 వ సంవత్సరంలో బ్రిటిష్ ప్రభుత్వం చేసిన కులగణన చివరిదని ఇటీవల బీహార్ ఆంధ్రప్రదేశ్లో బీసీ కులమైన చేపట్టారని ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి ముందుకొచ్చి కులగణన చేపట్టడం హర్షనీయమన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల జీవన వైవిధ్య అంశాలను సర్వే ద్వారా తీసుకొని అందరికీ లబ్ధి చేకూరే విధంగా కార్యాచరణ ముందుకు సాగుతుందన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కురుమ సాయిబాబా మాట్లాడుతూ.. ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కామారెడ్డి సభలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం బీసీలకు కులగనన చేపట్టడం బీసీలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ నిలబడుతుందని ఇదే నిదర్శనమని ఆయన అన్నారు. ఇటీవల ప్రకటించిన 37 కార్పొరేషన్లలో అధిక సంఖ్యలో బీసీలకు స్థానం కల్పించడం హర్షణీయమన్నారు. కుల సంఘాల ఫెడరేషన్లు ఏర్పాటు చేస్తున్నందుకు కూడా బీసీలకు ఆర్థికంగా రాజకీయంగా ముందుకు తీసుకెళ్లడం సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ నీలకంఠం, మాజీ వైస్ ఎంపీపీ నునుగొండ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, సొసైటీ డైరెక్టర్ నాగం గోపికృష్ణ, నాయకులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఎస్ఆర్ఆర్ కళాశాల లో
## ఈరోజు డాక్టర్ సయ్యద్ జాఫర్ జన్మదిన వేడుకలు



(శుభోదయం న్యూస్) కోటేశ్వరావు ,విజయవాడ: మంగళవారం నాడు ఉదయం 7 గంటలకు కాలేజీలు గ్రౌండ్లో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రెసిడెంట్ సుబ్బారావు మరియు మేక సుబ్బారావు ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు జరిపినారు. ఈ వేడుకల్లో మేక సుబ్బారావు మాట్లాడుతూ సయ్యద్ జాఫర్ ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీలో 35 సంవత్సరాలు పనిచేశారు. తర్వాత గత ఐదు సంవత్సరాలలో ఐదు ఆరు సినిమాలు చేశారు. అని తెలియపరిచారు. డోకుపర్తి శంకర్రావు మాట్లాడుతూ సినీ పరిశ్రమంలో పనిచేసిన జాఫర్ దినదిన అభివృద్ధి చెంది మంచి స్థాయికి వెళ్ళాలని ఆస్వర్ధించారు. అదేవిధంగా వాకర్స్ అసోసియేషన్ సభ్యులందరూ పేరుపేరునా గ్రౌండ్ జాయింట్ సెక్రటరీ డాక్టర్ సయ్యద్ జాఫర్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుబ్బారావు , డోగిపత్తి. శంకర్రావు, మేక. సుబ్బారావు , నాగరాజు, నాగేశ్వరరావు, రమాదేవి, విజయలక్ష్మి, పాలపర్తి దుర్గ, రసూల్, ఫరీద్, కొండిశెట్టి సురేష్ ఇతరులు పాల్గొన్నారు.



## అంబేద్కర్ యువజన
## సంఘం దమ్ములకపల్లి. విలేజ్ కమిటీ ఏకగ్రీవంగాఎన్నిక




కామారెడ్డి జిల్లా ప్రతినిధి పోచయ్య (శుభోదయం న్యూస్ ):-అంబేద్కర్ యువజన సంఘం జిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ బిట్ల సురేందర్ సమక్షంలో ఎల్లారెడ్డి. డివిజన్ ఉపాధ్యక్షులు దత్తు డాక్టర్ అధ్యక్షతన దాములకపల్లి విలేజ్ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అధ్యక్షుడు కొక్కుల రాజు, ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, భూమయ్య ప్రధాన కార్యదర్శి పురం గంగాధర్, కార్యదర్శి పరువయ్య, గంగాధర్, కోశాధికారి రవీందర్, సలహాదారులు హ్మమ0డ్లు ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ఎడ్లరవి ప్రధాన కార్యదర్శి కుసుల కంటి సాయిలు, పట్టణ అధ్యక్షుడు ఎర్రోళ్ల ఎలుబాబు, ఉపాధ్యక్షుడు నాగరాజు, కృష్ణ, సాయిబాబు, మహేందర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో
## పాల్గొన్న పెద్దపల్లి జిల్లా పార్లమెంట్ కో కన్వీనర్
## గుండెబోయిన లక్ష్మణ్ యాదవ్



రామగుండం మండలం రిపోర్టర్-తిరుపతి, (శుభోదయం న్యూస్) భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి సభ్యత్వ నమోదులో భాగంగా మూడు నాలుగు ఐదు తారీకు లో రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు ఈరోజు స్థానిక వీకే రెడ్డి లక్ష్మీనగర్ తిరుమల నగర్ లో స్పెషల్ డ్రైవ్ ను భారతీయ జనతా పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ కో కన్వీనర్ గుండబోయిన లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు శ్రీమతి శ్రీ సోమారపు లావణ్య అరుణ్ కుమార్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు పెద్దపల్లి రవీందర్ ముఖ్యఅతిథిగా



పాల్గొని ఈ స్పెషల్ డ్రైవ్ ను సామాన్య ప్రజానీకంతో పాటు వ్యాపారస్తులను ప్రత్యక్షంగా కలుస్తూ వారి యొక్క యోగక్షేమాలు తెలుసుకుంటూ భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించడం జరిగింది. గత రెండు నెలలుగా రామగుండం నియోజకవర్గంలో నత్తనడకగా నడుస్తున్నటువంటి భారతీయ జనతా పార్టీ సభ్యత్వానికి ఊపు తీసుకురావడంలో భాగంగా ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్ లో ఈరోజు గణనీయంగా భారతీయ జనతా పార్టీ సీనియర్ కార్యకర్తలు అందరూ పాల్గొని దాదాపుగా 20 మంది ముఖ్య కార్యకర్తలను ఒక్కొక్కరు 100 చొప్పున దాదాపుగా 2000 సభ్యత్వాన్ని ఈరోజు పూర్తి చేయడం జరిగింది. ఈనెల 10వ తారీఖు లోపు భారతీయ జనతా పార్టీ సీనియర్ కార్యకర్తలు అందరూ ముఖ్యమైన నాయకులు ఒక్కొక్కరు 100 చొప్పున దాదాపుగా 200 మంది క్రియాశీల సభ్యులు క్రియాశీల సభ్యత్వము చేసుకోవడానికి ఎలిజిబిలిటీ వచ్చే విధంగా కార్యకర్తలందరికీ ప్రతి కార్యకర్త క్రియాశీలక భూమిక పోషించి ప్రతి బూతులో ఇద్దరుకు తగ్గకుండా క్రియాశీల సభ్యులు చేయడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకుపోదామని ఈ సందర్భంగా వారు తెలియజేయడం జరిగింది ఇంకా ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మహావాది రామన్న భారతీయ జనతా పార్టీ యువ రాష్ట్ర నాయకులు సోమారపు అరుణ్ కుమార్ భారతీయ జనతా పార్టీ మాజీ కార్పొరేషన్ ఉపాధ్యక్షులు జనగామ సాగర్ జనగామ శివరామకృష్ణ కాదాసీ శంకర్ భారతీయ జనతా పార్టీ దళిత మూర్చ మాజీ కార్పొరేషన్ అధ్యక్షులు దెబ్బట కమలాకర్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సప్ప నాగరాజు గోశిక రమేష్ పుల్లూరి మహేందర్ గుండబోయిన గట్టయ్య సాగి కిషన్ రావు రాజేందర్ భీమ సుధీర్ చిలుముల సాగర్ అంబటి సతీష్ ఈదునేరి మల్లేష్ అంబటి తిరుపతి శివ ములుగురి వీరయ్య రాజేందర్ మంజుల మేడి రాజు ప్రసన్న మేకల సతీష్ అధిక సంఖ్యలో కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పొందిన సింగరాయకొండ వాసి




**సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్): పాత సింగరాయకొండకు చెందిన బిల్లా నవీన్ గతంలో ఆరోగ్యం బాగాలేక హాస్పిటల్ లో జాయిన్ అయ్యి వైద్య ఖర్చులు నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కి అప్లై చేయగా నేడు నాయుడుపాలెంలోని మంత్రి శ్రీ డోలబాల వీరాంజనేయ స్వామి చేతుల మీదగా 1,0,9000 రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ ను పొందారు.**

## డోగిపర్తి శంకర్రావు ఆధ్వర్యంలో
## డాక్టర్ సయ్యద్ జాఫర్ ఇంటిదగ్గర జన్మదిన వేడుకలు



ఎన్టీఆర్ జిల్లా ,విజయవాడ: (శుభోదయం న్యూస్):మంగళవారం సాయంత్రం డాక్టర్ సయ్యద్ జాఫర్ ఇంటిదగ్గర డోగిపత్తి శంకర్రావు ఆధ్వర్యంలో సినీ కళాకారుల మధ్యలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. శంకర్రావు శాలువా కప్పి సన్మానించారు. సినిమా కళాకారులు పూలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో డోగిపర్తి, శంకర్రావు , బోయిన. నాగరాజు, సాగర్, శ్రీధర్, కరిముల్లా, వెంకటేశ్వరరావు, కొండిశెట్టి .సురేష్, విజయలక్ష్మి, జుబేదా, రాజు స్వాతి రావు, పాలపర్తి .దుర్గ, వెంకటేశ్వరరావు , సత్య, శ్రీలక్ష్మి, మనేంద్రమ్మ, హేమ సాయి , జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## రోహిత్, బుమ్రా కాదు..
## అతనే టీమిండియా వెన్నుముక: మహమ్మద్ షమీ




టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీపై స్టార్ పేసర్ మహమ్మద్ షమీ ప్రశంసల జల్లు కురిపించాడు. విరాట్ కోహ్లీ భారత క్రికెట్ వెన్నుముక అని కొనియాడాడు.నేటి(నవంబర్ 5)తో విరాట్ కోహ్లీ 36వ ఏట అడుగుపెట్టిన విషయం తెలిసిందే. అతని పుట్టిన రోజు సందర్భంగా విరాట్ కోహ్లీకి అభిమానులు, మాజీ, సహచర క్రికెటర్లు, సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా విషెస్ తెలియజేశారు.కెరీర్లో కోహ్లీ మరిన్ని ఘనతలు సాధించాలని ఆకాంక్షించారు. అతనికి సంబంధించిన చిరస్మరణీయ ఇన్నింగ్స్లను గుర్తు చేసుకున్నారు. ఈ క్రమంలోనే మహమ్మద్ షమీ కూడా సోషల్ మీడియా వేదికగా విరాట్ కోహ్లీకి బర్త్ డే విషెస్ తెలియజేశాడు. టీమిండియా వెన్నుముక అంటూ కొనియాడాడు.'భారత క్రికెట్ వెన్నుముక, పరుగుల యంత్రానికి జన్మదిన శుభాకాంక్షలు. కోహ్లీ.. ఆటపై నీకున్న అంకిత భావం, పిచ్చి ఎంతోమందిలో స్ఫూర్తిని కలిగిస్తోంది. ఈ ఏడాది కూడా నువ్వు మరింత సక్సెస్ అవ్వాలని, సంతోషంగా గడుపుతూ మరిచిపోలేని అనుభూతులను సొంతం చేసుకోవాలని కోరుకుంటున్నా'అని షమీ ట్వీట్ చేశాడు. ప్రస్తుతం ఈ ట్వీట్ నెట్టింట వైరల్గా మారింది.చీల మండ గాయంతో భారత జట్టుకు దూరమైన మహమ్మద్ షమీ గతేడాదిగా భారత జట్టుకు దూరంగా ఉన్నాడు. అతను చివరిసారిగా గతేడాది నవంబర్లో ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే ప్రపంచకప్ 2023 ఫైనల్లో టీమిండియా తరఫున బరిలోకి దిగాడు. చీలమండ గాయానికి శస్త్ర చికిత్స చేయించుకున్నాడు.దాంతో గతేడాదిగా ఒక్క మ్యాచ్ ఆడలేదు. ఇటీవలే గాయం నుంచి పూర్తిగా కోలుకొని ప్రాక్టీస్ ప్రారంభించిన మహమ్మద్ షమీ.. న్యూజిలాండ్తో మూడు టెస్ట్ల సిరీస్ లేదా సౌతాఫ్రికాతో టీ20 సిరీస్తో రీఎంట్రీ ఇస్తాడని అంతా భావించారు. కానీ ఈ రెండు సిరీస్లకు అతన్ని సెలెక్టర్లు ఎంపిక చేయలేదు.ఇటీవలే బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీలో రిహాబిలిటేషన్ పూర్తి చేసుకొని ఫిట్నెస్ టెస్ట్ కూడా పాసయ్యాడు. అంతర్జాతీయ క్రికెట్లోకి వచ్చే ముందు దేశవాళీ క్రికెట్ ఆడుతానని ఓ ఇంటర్వ్యూలో షమీ తెలిపాడు. రంజీ ట్రోఫీలో రెండు మ్యాచ్లు ఆడి సత్తా చాటి.. ఆస్ట్రేలియాతో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆడుతానని చెప్పాడు.గాయం నుంచి పూర్తిగా కోలుకున్నానని కూడా స్పష్టం చేశాడు. అయితే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీకి ఎంపిక చేసిన జట్టులోనూ షమీకి చోటు దక్కలేదు. దాంతో బెంగాల్ తరఫున షమీ.. రంజీ ట్రోఫీ ఆడుతాడని అంతా భావించారు. కానీ తదుపరి రెండు రౌండ్ల రంజీ మ్యాచ్లకు సంబంధించి బెంగాల్ క్రికెట్ అసోసియేషన్ సోమవారం ప్రకటించిన రంజీ జట్టులో మహమ్మద్ షమీకి చోటు దక్కలేదు. దాంతో అతని రీఎంట్రీ మరింత ఆలస్యం కానుంది. విరాట్ కోహ్లీ సారథ్యంలోనే వరుస అవకాశాలు అందుకున్న షమీ స్టార్ పేసర్గా ఎదిగాడు.

## సౌదీ ఎడారిలో హిమపాతం..
## చరిత్రలో తొలిసారి.. వాతావరణ శాఖ హెచ్చరికలు..!



భారీ వర్షాలు, వడగళ్ళు సౌదీ అరేబియాలోని కొన్ని ప్రాంతాలను శీతాకాలపు వండర్ల్యాండ్గా మార్చాయి. సౌదీ అరేబియా ఎడారిని హిమపాతం ముంచెత్తింది. పర్వతాలు, లోయలు, జలపాతాలు తెల్లని మంచుతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి.ఎక్కువగా అల్-జాఫ్ ప్రాంతంలో ఆ దృశ్యాలు కనిపిస్తున్నాయి. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎటు చూసిన తెల్లటి మంచు దుప్పటి కప్పేసినట్టుగా కనిపించింది. వాటిని చూసి అక్కడి పౌరులు, శాస్త్రవేత్తలు ఆశ్చర్యపోతున్నారు. ఇందుకు సంబంధించిన ఫోటోలను వారు సోషల్ మీడియాలో సైతం పోస్ట్ చేశారు. అవి వైరల్గా మారాయి.సౌదీ అరేబియాలోని ఉత్తర ప్రాంతంలో ఈ విధంగా మంచు కురువడం ఇదే తొలిసారి. కాగా, ఎడారిప్రాంతమైన దుబాయ్లో భారీ వర్షాలు, మంచు కురువడంపై యూఏఈ లోని జాతీయ వాతావరణ కేంద్రం స్పందించింది. ఈ అసాధారణ వాతావరణానికి గల కారణం.. అరేబియా సముద్రం నుంచి ఒమన్ వరకు అల్పపీడనం వ్యాపించి ఉండటమేనని స్పష్టం చేసింది. ఆ కారణంగానే వాతావరణంలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయని వివరించింది. మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో రాబోయే రోజుల్లో అల్-జాఫ్ ప్రాంతంలో ఉరుములు, తుఫానులు, వడగళ్లతో కూడిన వర్షాలు కురవచ్చని సౌదీ వాతావరణ విభాగం హెచ్చరికలు జారీ చేసింది.సౌదీ అరేబియా మాత్రమే ఇలాంటి అసాధారణ వాతావరణ పరిస్థితులు ఎదుర్కొంటున్న ఏకైక దేశం కాదు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ కూడా ఇలాంటి వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటోంది. గత అక్టోబర్ 14న, జాతీయ వాతావరణ కేంద్రం ఊహించని విధంగా భారీ వర్షపాతం నమోదైంది. ఉరుములు, మెరుపులతో కూడి వడగళ్ల వర్షం అనేక ప్రాంతాలను ఉక్కిరిబిక్కిరి చేసింది. రాబోయే రోజుల్లో అల్ జఫ్ ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో పిడుగులు పడే అవకాశముందని జాతీయ వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీ చేసినట్లు ఖలేజా టైమ్స్ వివరించింది. అలాగే భారీ వర్షాలు, వడగళ్లు వానలు కురుస్తాయని చెప్పింది.

# రౌడీలు, గూండాలను వదలొద్దు: పవన్ కళ్యాణ్



**అమరావతి,:** ప్రజల నుంచి భూములు లాక్కొని స్వంత ఆస్తి మాదిరిగా కొట్టుకుంటున్నారని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విమర్శించారు. మంగళవారం పల్నాడు జిల్లాలోని మాచవరం,దాచేపల్లి మండలాల్లో సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ సంస్థకు చెందిన భూములను ఆయన పరిశీలించారు. వైసీపీ నాయకులు ఇంకా ప్రభుత్వంలో ఉన్నట్టు ప్రవర్తిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు. శాంతి భద్రతలు ఎంత బలంగా ఉన్నాయో వాళ్లకు తెలిసేలా చూపాలన్నారు. పోలీస్ అధికారులు మెత్తబడిపోయారా? లేక భయపడుతున్నారా అని ఆయన ప్రశ్నించారు. ప్రజలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులదేనని ఆయన చెప్పారు. రౌడీయిజాన్ని అరికట్టాల్సిన బాధ్యత పోలీసులదేనని ఆయన తేల్చి చెప్పారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడొద్దని ఆయన పోలీసులకు సూచించారు. రౌడీలు, గూండాలను ఎట్టి పరిస్థితుల్లో వదలొద్దని ఆయన పోలీసులను ఆదేశించారు. మెత్తగా ఉంటే ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఇష్టానుసారం ఎవరైనా మాట్లాడితే ఇకపై ఊరుకొనేది లేదన్నారు. సరస్వతి పవర్ ఇండస్ట్రీస్ సంస్థకు భూములిచ్చిన రైతులకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. 400 ఎకరాల అటవీ భూములంటే రెవిన్యూ భూములుగా మార్చి లాక్కున్నారని ఆయన ఆరోపించారు. 2009లో 30 ఏళ్లకు లీజుకు తీసుకొని మళ్లీ 50 ఏళ్లకు పెంచేశారన్నారు. 24.78 ఎకరాల కుంటలు, చెరువులు స్వాధీనం చేసుకున్నారన్నారు. సహజ వనరులు ఎవరి సొత్తు కాదన్నారు.

# ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి అమ్మాలి



**హైదరాబాద్, :** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే పత్తి అమ్మాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు పేర్కొన్నారు. ఆయన ఈ రోజు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ ఉదయ్ కుమార్, ఇతర అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పత్తి సేకరణ కోసం సీసీఐ అధికారులు 105 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారని తెలిపారు. అలాగే, ప్రతి జిన్నింగ్ మిల్లు నోటిఫై చేసిన విధంగా పనిచేయాలని స్పష్టం చేసినట్లు తెలిపారు. పత్తి కొనుగోళ్లలో తేమ శాతం తగ్గించే విషయంలో సీసీఐ సీఎండీతో చర్చించామని, వ్యవసాయం సంబంధిత సమస్యలు ఉంటే రైతులు వాట్సాప్ నెంబర్ 8897281111 ద్వారా స్పందించాలని సూచించారు. మరోవైపు, పత్తి కొనుగోలు ప్రక్రియలో ఏవైనా ఇబ్బందులు వస్తే, కలెక్టర్లు , మార్కెటింగ్ అధికారులు వాటిని త్వరగా పరిష్కరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ఆదేశించారు.

# మెట్రో ప్రయాణికులకు షాక్.. కొత్త కోచ్ లు లేవంటా..!



**హైదరాబాద్, :** హైదరాబాద్ మెట్రో రైళ్లలో ఈ మధ్య తరుచూ సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. సోమవారం కూడా మెట్రో రైళ్లలో సాంకేతిక సమస్య ఏర్పడింది. మెట్రో రైలులో సాంకేతిక సమస్య రావడంతో రైల్వే స్టేషన్ లో రైలు 15 నిమిషాలు ఆగాల్సి వచ్చింది. దీంతో రైళ్లు ఆలస్యంగా నడిచాయి. నాగోల్ నుంచి రాయదుర్గం వెళ్తుండగా హైదరాబాద్ మెట్రో రైలు బేగంపేట స్టేషన్‌లో దాదాపు 15 నిమిషాల పాటు ఆగిపోయింది. గత జూన్ 5 తేదీన కూడా మెట్రో రైళ్లలో సాంకేతిక సమస్య వచ్చింది. దీంతో మెట్రో రైళ్లలో సాంకేతిక సమస్యపై మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి స్పందించారు. మెట్రో రైళ్లలో అప్పుడప్పుడు సాంకేతిక సమస్యలు వస్తుంటాయని పేర్కొన్నారు. మీడియా ఇలాంటి వాటిపై ఎక్కువగా ఫోకస్ చేస్తుందని చెప్పారు. ప్రపంచంలో సక్సెస్ అయిన మెట్రోలలో హైదరాబాద్ మెట్రో ఒకటిగా నిలిచిందని ఎన్వీఎస్ రెడ్డి గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశపై ప్రత్యేకంగా దృష్టి సారించారని తెలిపారు. రూ. 24,269 వేల కోట్ల రూపాయలతో రెండవ దశ మెట్రో పనులను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. చాంద్రాయణగుట్ట ప్రధాన జంక్షన్ అవుతుందని వివరించారు. గత 8 ఏళ్లలో కొత్త మెట్రో రాకపోవడం వల్ల హైదరాబాద్ మెట్రో 9వ స్థానానికి చేరిందని.. రెండో దశ మెట్రో పూర్తయితే రెండో స్థానానికి చేరుకునే అవకాశం ఉందని వివరించారు. మెట్రో కోచ్ ల పై కూడా ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడారు. మెట్రో కొత్త కోచ్ లు ఇప్పుడు అందుబాటులోకి తీసుకురావడం సాధ్యం కాకపోవచ్చని అన్నారు. త్వరలో నాగపూర్ నుంచి మెట్రో కోచ్ లను అద్దె ప్రాతిపదికన తీసుకురానున్నట్లు ప్రకటించారు. మెట్రో నిర్మించడం సులవైన పని కాదని.. 2010లో బిడ్ ప్రాసెస్ కి వెళ్తే.. ఈరోజు ఈ పరిస్థితి చూస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం మెట్రో రెండో దశకు అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. రెండో దశలో 5 మార్గాల్లో మెట్రో రైలు ట్రాక్ వేయనున్నారు. ఇందులో రాయదుర్గ–కోకాపేట వరకు 11.6 కిలో మీటర్లు, ఎంజీబీఎస్ నుంచి చాంద్రయాణగుట్ట వరకు 7.5 కిలో మీటర్లు, నాగోలు నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 36.8 కిలో మీటర్లు, మియాపూర్ నుంచి పటాన్ చెరువు వరకు 13.4 కిలో మీటర్లు, ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు 7.1 కిలో మీటర్లు మెట్రో పనులు చేపట్టనున్నారు.

## ముడా స్కామ్లో లోకాయుక్త నోటీసులు..

# విచారణకు సీఎం సిద్ధరామయ్య



హైదరాబాద్ : ముడా స్కామ్లో లోకాయుక్త ఎదుట హాజరవుతానని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య వెల్లడించారు. స్కామ్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆయనకు ఇటీవల లోకాయుక్త విచారణకు రావాలని సమన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. హుబ్లీ ధార్వాడ్లో మంగళవారం ముఖ్యమంత్రి ఓ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకాయుక్త ఎదుట హాజరవుతున్నారా? అని ఆయనను మీడియా ప్రశ్నించింది. దీనికి ఆయన బదులిస్తూ రేపు (బుధవారం) ఉదయం 10 గంటలకు వెళ్తున్నానని బదులిచ్చారు. ఈ నెల 6న విచారణకు రావాలని సిద్ధరామయ్యకు లోకాయుక్త సమన్లు పంపింది. ఇంతకు ముందు ఈ కేసులో సీఎం భార్య పార్వతిని అక్టోబర్ 25న విచారించారు. ఆమె సోదరుడు మల్లికార్జున స్వామితో పాటు దేవరాజులను విచారించింది. దేవరాజు వద్ద మల్లికార్జున స్వామి భూమిని కొనుగోలు చేసి తన సోదరి పార్వతికి బహుమతిగా ఇచ్చారు. అయితే, సీఎం సిద్ధరామయ్య ఎలాంటి తప్పు చేయలేదని.. ఆయనను చూసి ప్రతిపక్షాలు భయపడుతున్నాయని.. అందుకే ఆరోపణలు చేస్తున్నాయని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ముడా స్కామ్లో మాజీ కమిషన్ డీబీ నటేశ్ని ఈడీ ప్రశ్నించింది. విచారణ అనంతరం ఆయనను అదుపులోకి తీసుకున్నది. ముడా భూ కుంభకోణం కేసులో ఈడీ మానీలాండరింగ్ కోణం దర్యాప్తు చేస్తున్నది.

# కులగణనతోనే... బీసీలకు సామాజిక న్యాయం: ఎస్. అబ్దుల్ ఖాలిక్




వెనుకబడిన తరగతుల సంక్షేమం విషయంలో కులగణన అనేది కీలకమైన అంశం. వెనుకబడిన తరగతుల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అందించడానికి కులగణన ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేకాదు, బీసీ వర్గాల మేలు కోసం కొత్త పథకాల రూపకల్పనకు సైతం కులగణన దోహదపడుతుంది. మన దేశంలో పెద్ద సంఖ్యలో ఉన్న వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు జరగాలన్నా కులాలవారీగా జనాభాను లెక్కించి తీరాల్సిన అవసరం ఉంది. బీసీల నాయకత్వంలో నడిచే ప్రధాన రాజకీయ పార్టీలు చాలా కాలంగా ఈ డిమాండ్ చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఓబీసీలకు మేలు జరిగే విధంగా తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకోవడం ఎంతైనా అభినందనీయం. కులగణనతో రాజకీయ ప్రత్యర్థులపై సమరానికి సన్నద్ధమైంది తెలంగాణ సర్కార్. దాదాపు ఏడాది కిందట తెలంగాణ ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కులగణన అంశాన్ని ప్రస్తావించారు. కులగణనతోనే సమాజంలో అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలోనే కులగణనకు రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకుంది. నిజంగా ఇది శుభ పరిణామమే. ఆర్థిక, సామాజిక అసమానతలకు అడ్డుకట్ట వేయడంలో కులగణన ఎంతగానో తోడ్పడుతుంది. దేశంలోనే తొలిసారి కులగణన నిర్వహించి సెహభాష్ అనిపించుకున్నారు బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్. సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్ అంటూ గొప్పలు చెప్పుకునే కేంద్ర ప్రభుత్వ పెద్దలు చేతులెత్తేసిన కులగణన సర్వేను తమ స్వంత రాష్ట్రంలో నితీశ్ కుమార్ విజయవంతగా చేపట్టారు. మొత్తం రెండు దశల్లో కులగణన ప్రక్రియను నితీశ్ కుమార్ పూర్తి చేశారు. బీజేపీ అసాధ్యమనుకున్నదానిని నితీశ్ కుమార్ సుసాధ్యం చేసి చూపించారు. యావత్ భారతదేశానికి బీహార్‌ను ఒక రోల్ మోడల్‌గా ఆయన తీర్చిదిద్దారు.

## రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం

ఈ నేపథ్యంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా ఒత్తిడి పెరిగింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పలువురు బీసీ సంఘం నేతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. తెలంగాణలోనూ కులగణన చేపట్టాలని కోరారు. బీసీ సంఘాల నేతల విజ్ఞప్తికి రేవంత్ సానుకూలంగా స్పందించారు. ఇప్పుడు కులగణనపై రేవంత్ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. వెనుకబడిన తరగతుల ప్రయోజనాల దృష్టితో చూస్తే, కులగణన అనేది చాలా ముఖ్యమైన అంశం. వెనుకబడిన తరగతుల్లో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు అందించడానికి కులగణన ఎంతగానో ఉపయోగపడుతుంది. అంతేకాదు, వెనుకబడిన తరగతుల మేలు కోసం కొత్త పథకాల రూపకల్పనకు సైతం కులగణన దోహదపడుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లలో కూడా బీసీ వర్గాలకు కులగణన సహాయపడుతుంది. వాస్తవానికి దేశంలో పెద్ద సంఖ్యలో ఉన్న వెనుకబడిన తరగతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు జరగాలన్నా కులాలవారీగా జనాభాను లెక్కించి తీరాల్సిన అవసరం ఉంది.

## కులగణన 1931తోనే ఆగిపోయిందా?

బీసీల నాయకత్వంలో నడిచే ప్రధాన రాజకీయ పార్టీలు చాలా కాలంగా ఈ డిమాండ్ చేస్తున్నాయి. కులాలవారీగా లెక్కలు స్పష్టంగా లేనట్లయితే తమ మేలు కోసం తీసుకువచ్చే చట్టాల అమలులో తీవ్ర ఇబ్బందులు ఉంటాయని బీసీ వర్గాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశ జనాభాలో కులపరంగా, ఆర్థికంగా, చదువుపరంగా వెనుకబడిన కులాలు 52 శాతం ఉంటారన్నది ఒక అంచనా. వీరికి కేంద్ర ప్రభుత్వ, పబ్లిక్ రంగ సంస్థల ఉద్యోగాలలో 27 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మండల్ కమిషన్ గతంలోనే సిఫార్సు చేసింది. 1931లో చివరిసారిగా జరిగిన కులగణన వివరాలను ఓబీసీల గుర్తింపునకు ప్రాతిపదికగా తీసుకుంది. అప్పటి నుంచి దేశంలో వివిధ వెనుకబడిన తరగతులు ఎంత శాతం ఉన్నాయనే విషయాన్ని కచ్చితంగా లెక్కగట్టాలనే డిమాండ్ బలంపుంజుకొంది. అయినా 2001, 2011 లో జరిగిన జనగణనలో కులాల వారీగా లెక్కలు తీయడానికి కేంద్రం అంగీకరించలేదు.

## లెక్కలు తేలక నష్టపోతున్న బీసీలు !

దేశవ్యాప్తంగా కులగణన జరగకపోవడంతో వెనుకబడిన తరగతులు నష్టపోతున్నాయి. కులాలవారీ జనాభా లెక్కలపై స్పష్టత లేకపోవడమే ఇందుకు కారణం. బీసీ జనాభాకు చెందిన లెక్కల వివరాలు లేకపోవడంతో రిజర్వేషన్ల శాతం నిర్ణయించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. బీసీ జనాభా లెక్కలు స్పష్టంగా లేకపోవడం వల్లనే సుప్రీంకోర్టు, హైకోర్టులు రిజర్వేషన్ల శాతాన్ని నిర్ణయించడాన్ని కొట్టి వేస్తున్నాయి. జనాభా లెక్కలు సమగ్రంగా లేకపోవడంతో రిజర్వేషన్లను ఏ మేరకు నిర్ణయించాలనే అంశంపై బీసీ కమిషన్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో వెనుకబడిన తరగతులకు ప్రయోజనాలు కలిగే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించాల్సిన అవసరం ఉంది. 1931 తర్వాత ఎస్సీ, ఎస్టీ మినహా కులాలవారీగా జనగణన చేపట్టనే లేదు. ఏదిఏమైనా వెనుకబడిన తరగతుల జనాభాపై ఇప్పటివరకు అంచనాలే తప్ప ఒక స్పష్టత అంటూ లేదు. దీంతో మొత్తం జనాభాలో ఓబీసీల శాతం ఎంత అనేది ఒక అంచనాగానే మిగిలిపోతోంది. ఈ పరిస్థితుల్లో ఓబీసీలకు మేలు జరిగే విధంగా తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకోవడం ఎంతైనా అభినందనీయం.

# ఈ అంధకారం ఇంకా ఎన్నాళ్లు - సంపత్ గడ్డం




ఈ దేశంలో ప్రధానంగా దళితుల పరిస్థితి రోజుకు రోజుకు మరింత అద్వానంగా మారుతుంది. ఇప్పటికీ మెజారిటీ దళితులకు పారిశుధ్య రంగమే దిక్కవుతుంది. ఇది అధికారిక లెక్కల్లో కూడా తేలింది. ఈ దేశంలో పారిశుధ్య రంగంలో ఎక్కువగా సేవ చేసేది దళిత సామాజిక వర్గానికి చెందిన వారే.. క్షేత్ర స్థాయిలో ఉండే ఈ రంగం తప్ప దళితులకు మెరుగైన అవకాశాలు ఆశించినంత దక్కడం లేదు. ఇదిలా ఉంటే దేశంలో వివిధ నేరాలు చేసి జైలు జీవితం శిక్ష అనుభవించే వారిలోనూ జైళ్లలోనూ కుల ఆదారాన్ని బట్టి పనులు కేటాయించడాన్ని చూస్తే దళితుల పరిస్థితి ఈ దేశంలో ఎంత ఘోరమో అర్థం అవుతుంది. సమూలంగా దళితులకు రావాల్సిన అవకాశాలను కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం కావడం బాధాకరం. వర్గీకరణ అమలుతో కూడిన నియామకాలు చేపడితే తప్పా మాదిగ, ఉపకులాల బతుకుల్లో వెలుగులు నిండవు. ప్రస్తుతం దేశంలో ఎస్సీ వర్గీకరణ మీద ఇటీవల సుప్రీంకోర్టు తీర్పును చూస్తే దళితుల భవిష్యత్తు అర్థమవుతుంది. మూడు దశాబ్దాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని ఉద్యమం వల్ల ఎబీసీడీ వర్గీకరణ కోర్టు సానుకూల తీర్పునిచ్చింది. మరోవైపు ఏ రాష్ట్రంలో ఆ రాష్ట్రాలకే ఎస్సీ వర్గీకరణ చేసుకునే హక్కు ఇచ్చింది. దీంతో దళితుల్లోని మెజారిటీ ప్రజలకు, అటు ఉపకులాలకు ఈ తీర్పు వారి బతుకుల్లో వెలుగులా మారింది. అన్ని రాష్ట్రాల కంటే తమ రాష్ట్రమే తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీలో చెప్పారు. ఇప్పటికే ఉపాధి అవకాశాలు లేక మానసికంగా మాదిగ నిరుద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదే గతంలో దేశ వ్యాప్తంగా ఈడబ్ల్యుఎస్ రిజర్వేషన్లను తీసుకువచ్చింది. అది తెలంగాణ రాష్ట్రంలో సంపూర్ణంగా అమలవుతుంది. ఎస్సీ, బీసీల కంటే తక్కువ మార్కులు వచ్చిన వారికి ఈడబ్ల్యుఎస్ కోటా కింద ఉద్యోగాలు పొందారు. ఈడబ్ల్యుఎస్‌ను అంత తొందరగా అమలులోకి తెచ్చిన ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ తీర్పు వచ్చినా కమిటీల పేరుతో కాలయాపన చేయడం మంచిది కాదు.

## ఆ పరీక్షలకూ వర్గీకరణ వర్తింపజేయాలి

తెలంగాణ గ్రూపు - 1లో మెయిన్స్ కోసం అనేక మంది అభ్యర్థులు వాయిదా వేయాలని ఆందోళనలు చేశారు. ఈ విషయంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు ప్రజాప్రతినిధులు సైతం ప్రభుత్వ విధానాలను తప్పు బట్టారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అయితే అన్యాయం జరుగుతుందని లెక్కలతో చెప్పారు. అయినా కోర్టులు సమర్ధించి పరీక్ష నిర్వాహణకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పరీక్షలు నడుస్తున్నాయి. తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ కోసం కేబినేట్ సబ్ కమిటీని మంత్రులతో కూడిన కమిటీని వేశారు. ఆ తరువాత ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఏక సభ్య కమిషన్ హై కోర్టు మాజీ న్యాయమూర్తి షమీమ్ అక్తార్‌తో వేసింది. 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. అయితే ఆ లోపు జరిగే ఉద్యోగ నోటిఫికేషన్లకు సంబందించిన పరీక్షలను సైతం ఆ కమిటీ రిపోర్ట్ వచ్చే వరకూ వాయిదా వేయాలి. లేదంటే గ్రూపు 2, గ్రూపు 3లోనూ మాదిగ అభ్యర్థులకు తీవ్రమైన నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇప్పుడు ఎస్సీ జాబితాలోని పూర్తి లెక్కలు తీయకుండా.. వర్గీకరణ అమలు చేయకుండా నియామక పరీక్షలు నిర్వహిస్తే మాదిగ నిరుద్యోగ అభ్యర్థులు మరో దశాబ్దం అంధకారంలోకి వెళ్లే అవకాశం ఉంది. గ్రూపు -2, గ్రూపు 3లోనైనా ఎస్సీ వర్గీకరణ అమలు చేసేలా ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చి న్యాయం చేయాలి.

## మాదిగలకు తొలి నుంచీ అన్యాయమే...!

మాదిగల కంటే మాల కమ్యూనిటీ ఒక తరం ముందు ఉందని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. అలాగే మాదిగల ఓట్ల వల్లే తాను జడ్పీటీసీ కాగలిగానని, ఆ తరువాత ఎమ్మెల్యేగా ఇలా అనేక సందర్భాలలో మాదిగలు తన వెంట నిలిచారని ఆయన చెప్పారు. మాదిగలకు కొంత అన్యాయం జరుగుతున్న మాట వాస్తవమేనని సీఎం రేవంత్ రెడ్డి ఒప్పుకున్నారు. అటువంటి స్పష్టత ఉన్నప్పుడు తక్షణం ఎస్సీ వర్గీకరణ అమలులోకి తెచ్చి అత్యంత వెనుకబడిన మాదిగ, ఉపకులాల సామాజిక వర్గాలకు అండగా నిలవాలి. లేకుంటే మాదిగల బతుకులు చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడే పరిస్థితి ఉంది. ఆర్థిక వెనుకబాటు ఉన్న వారికి రిజర్వేషన్ల అమలులో ఎటువంటి జాప్యం లేకుండా అమలు చేస్తున్నప్పుడు .. తరతరాలుగా నలిగిపోతున్న ఈ వర్గాలకు సుప్రీం ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలతోనైనా వీలైనంత త్వరగా అమలు చేయాలి.

## మా ఆకాంక్షను అర్థం చేసుకోండి

తెలంగాణలో జరగబోయే ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూడాలి. లేకుంటే డీఎస్సీ, గ్రూపు -1లో నష్టపోయినట్లు మరోసారి నష్టపోయే అవకాశం ఉంది. నవంబర్‌లో గ్రూపు 3, డిసెంబరులో గ్రూపు 2 పరీక్షలు నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఒకవేళ ఈ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు కల్పించకపోతే నష్టం జరిగే అవకాశం లేకపోలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి... తరతరాల మాదిగల ఆవేదనను అర్థం చేసుకోవాలి. వర్గీకరణ అమలుతో కూడిన నియామకాలు చేపడితే తప్పా మాదిగ, ఉపకులాల బతుకుల్లో వెలుగులు నిండవు. ఎవరి జనాభా ప్రతిపాదికన వారికి దక్కాల్సిన వాటా దక్కాల్సిందే. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పాలకుల అధికార దాహనికి...మాదిగల నినాదం బలమై... మా బతుకులు బలిపీఠం మీద వేలాడేలా చేయడం మంచిది కాదు.

# విజయ్ గెలిచేనా...



సినీరంగం నుంచి రాజకీయరంగంలోకి ప్రవేశించిన మరో తమిళ నటుడు విజయ్‌కు చెందిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ఆదివారంనాటి కార్యవర్గ సమావేశంలో పాతికకుపైగా తీర్మానాలు చేసింది. కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలోని భారతీయ జనతాపార్టీ, రాష్ట్రంలో స్టాలిన్ నేతృత్వంలోని ద్రవిడ మున్నేట్ర కళగం (డీఎంకె) లక్ష్యంగా ఈ తీర్మానాలు ఉన్నాయి. జమిలి ఎన్నికల ఆలోచన ఉపసంహరించుకోవాలని, నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్)నుంచి తమిళనాడు బయటకు రావాలని, అటు కేంద్రం, ఇటు రాష్ట్రం కూడా తమిళనాట కులగణన ఊసెత్తకపోవడం ఇత్యాదివి ఈ తీర్మానాల్లో ఉన్నాయి. కేంద్రం తెస్తున్న వక్ఫ్‌బిల్లుకు వ్యతిరేకంగానూ, రాష్ట్రంలో ద్విభాషా విధానమే ఉండాలనీ, హిందీకి రాష్ట్రంలో చోటులేదంటూ కూడా తీర్మానాలు జరిగాయి. అధికారంలోకి వచ్చేందుకు స్టాలిన్ అబద్ధపు హామీలు ఇచ్చారని, ప్రజలను మోసం చేశారని కూడా ఆ పార్టీ తప్పుబట్టింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో పార్టీ ఆరంభం నిర్ణయాన్ని ప్రకటించిన తరువాత, కొద్దినెలలపాటు వ్యవహారం వేగం పుంజుకోలేదు కానీ, ఇటీవల విజయ్ తన జోరుపెంచారు. వారం క్రితం పార్టీ ప్రారంభ మహాసభ లక్షలమందితో కిటకిటలాడిపోయింది. గ్లామర్ ఉన్న నటులకు అభిమానుల తోపాటుగా ఆ పాటి జనం రాకపోరన్నమాట నిజమే కానీ ఆ సభను ఎంతో పకడ్బందీగా, క్రమశిక్షణతో నిర్వహించడం విశేషం. విజయ్‌లో మంచి వక్త ఉన్నాడని ఆ సభ రుజువుచేసింది. అనవసరపు పంచ్ డైలుగులు, అర్థంలేని ఆవేశపూరిత వ్యాఖ్యలు లేకుండా ఆకట్టుకొనే రీతిలో చక్కని ప్రసంగం చేశారు. బీజేపీని సైద్ధాంతిక శత్రువుగా, డీఎంకెని రాజకీయ ప్రత్యర్థిగా ప్రకటించారు. దానిని మతతత్వ ఫాసిస్టు పార్టీగా, దీనిని అవినీతిమయమైన కుటుంబపార్టీగా నిర్వచించారు. ద్రవిడ పదాన్ని అడ్డంపెట్టుకొని, ఈ కుటుంబపార్టీ రాష్ట్రప్రయోజనాల విషయంలో రాజీపడుతూ, కొందరితో లాలూచీకి వచ్చి రాజ్యాన్ని ఏలుకుంటోందని విజయ్ విమర్శలు చేశారు. కామరాజ్, అంబేడ్కర్, వేలు నాచ్చియార్ సహా తనకు ఎందరో ఆదర్శమని, సామాజికన్యాయం, మహిళా సాధికారత ఇత్యాది లక్ష్యాలకు కట్టుబడివున్నామని, దేవుడు లేడన్న వాదన మినహా పెరియార్‌ను మిగతా అన్ని విషయాల్లో అనుసరిస్తామని విజయ్ చెప్పుకొచ్చారు. ఆ సందర్భంగా ఆయన ప్రకటించిన పార్టీ విధానాలమీద తమిళనాడును దశాబ్దాలుగా ఏలుతున్న అన్నాడీఎంకె, డిఎంకె వంటి పార్టీలనుంచి విమర్శలు రావడం సహజం. కొత్తసీసాలో పాతసారా, కలగూరగంప, కాపీ పేస్ట్ ఎజెండా, కాక్‌టెయిల్ వంటి విమర్శలు ఈ కొత్తపార్టీ ఎదుర్కొంటోంది. రాజకీయాల్లోకి కొత్తయినా ఏ దశలోనూ తాను వెనక్కుతగ్గేది లేదని విజయ్ కాస్తంత గట్టిగా చెబుతున్నారు. ఆరంభం బాగుంది అంటూ రజనీకాంత్ అందించిన శుభాకాంక్షల సందేశంలో కొనసాగింపే కష్టమన్న ధ్వని చాలామందికి తోచింది. రాజకీయరంగ ప్రవేశానికి సర్వమూ సిద్ధం చేసుకున్న తరువాత, దశాబ్దాలుగా సినీరంగంనుంచి పోగేసుకున్న ఆస్తులు, అభిమానాలు పెద్ద ఎత్తున ఉన్నప్పటికీ, వయసు, ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని రజనీ ఆఖరునిముషంలో వెనకడుగువేసిన విషయం తెలిసిందే. కమలహాసన్ సైతం సొంతంగా పార్టీ ఆరంభించి బొక్కబోర్లాపడ్డారు. గత తమిళ అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా ఆర్నెల్లముందు పార్టీని ప్రకటించి, సిద్ధాంతాలు ఆదర్శాలు అంటూ ఏవో కొన్ని ప్రజలముందు ఉంచిన రజనీకాంత్, నిర్భయంగా రాజకీయ రంగప్రవేశం చేసివుంటే డీఎంకె ఇంత సులభంగా అధికారంలోకి రాగలిగివుండేదా అన్నది కొందరి అనుమానం. ఇప్పుడు, విజయ్ కొత్తపార్టీ ఎవరికి మేలుచేస్తుందన్న చర్చ విస్తృతంగా జరుగుతోంది. ద్రవిడ మున్నేట్ర కళగంను దెబ్బతీయడానికే ఈ తమిళగ వెట్రి కళగం పుట్టుకొచ్చిందని స్టాలిన్ విమర్శలు చేస్తున్నారు. కుమారరత్నం ఉదయనిధిని సీఎం కుర్చీలో కూచోబెట్టాలని ఆయన ఆశపడుతున్న తరుణంలో దాదాపు అంతే వయసున్న విజయ్ రాజకీయాల్లోకి రావడం విశేషమైన పరిణామం. అయితే, తమిళరాజకీయాల్లో విజయ్ ప్రవేశం డీఎంకెను కాక అంతకంటే అధికంగా దానికి బలమైన ప్రత్యర్థిగా ఉన్న అన్నాడీఎంకెను దెబ్బతీస్తుందని ఒక విశ్లేషణ. తమిళ ఓటర్లు ప్రధానంగా ఈ రెండుపార్టీల మధ్యా చీలిపోయివున్న నేపథ్యంలో, కరుణానిధి పార్టీ వ్యతిరేకులైన జయలలిత పార్టీ అభిమానులను విజయ్ పెద్ద ఎత్తున తనవైపు తిప్పుకోవచ్చును. జయలలిత మరణానంతరం ముక్కలై, ఆధిపత్యపోరుతో క్రమంగా బలహీనపడుతున్న జయలలితపార్టీనుంచి ఓటర్లు విజయ్‌వైపు మళ్ళిపోవడం అనూహ్యమేమీ కాదు. ఎంతో ఘనంగా తన రాజకీయప్రస్థానాన్ని ఆరంభించిన విజయ్ తమిళరాజకీయాల్లో ఎటువంటి ప్రభావం చూపగలరో 2026లో తేలుతుంది.

## పిఠాపురం అభివృద్ధి కోసం పవన్ కీలక నిర్ణయం..
# సొంత నియోజకవర్గంపై స్పెషల్ ఫోకస్..




**అమరావతి,:** ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పాలనలో దూసుకుపోతున్నారు. రోజూ ప్రజల్లోనే ఉంటూ సమస్యలు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించాలని ఆయా అధికారులకు చెప్తున్నారు. ఇక తన నియోజకవర్గం పిఠాపురం పై స్పెషల్ ఫోకస్ పెట్టారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పిఠాపురంను కుదిరినప్పుడల్లా సందర్శిస్తూ అక్కడ అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇప్పటికే పిఠాపురంలోని పలు స్కూల్స్ కు అన్ని వసతుల ఏర్పాట్లు, తన సొంత డబ్బుతో స్థలం కొనివ్వడం.. ఇలా అనేక డెవలప్మెంట్ కార్యక్రమాలు చేసారు. తాజాగా పిఠాపురంలోని పలు గ్రామాలను సందర్శించారు. పిఠాపురంలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారంచుట్టారు. ఇందుకు నిధులు కూడా విడుదల చేసారు. పిఠాపురంలో ఉన్న సమస్యలు అన్ని తెలుసుకొని ఆయా విభాగాల అధికారులకు సూచనలు జారీ చేసారు. తాజాగా పల్లె పండగ వారోత్సవాల్లో భాగంగా జరిగిన సభలో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి మాట్లాడారు. ఈ క్రమంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. పిఠాపురం ప్రాంతం సమగ్రాభివృద్ధి కోసం 'పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (పాడా)' ఏర్పాటు చేస్తామని తెలిపారు. దీంతో పిఠాపురం ప్రజలు సంతోషం వ్యక్తం చేసారు. పవన్ ను భారీ మెజార్టీతో గెలిపించుకున్నందుకు బాగానే పనిచేస్తున్నారని అనుకుంటున్నారు. ఇక పవన్ కూడా తనను గెలిపించిన పిఠాపురంపై స్పెషల్ ఫోకస్ పెట్టి బాగానే డెవలప్ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. త్వరలోనే పిఠాపురం ఏరియా డెవలప్మెంట్ అథారిటీ ఏర్పాటు చేసి తన నియోజకవర్గాన్ని అందరూ మెచ్చుకునేలా చేస్తారేమో చూడాలి.

## వైకాపా సైకోలు భయపెడుతుంటే.. జగన్ సూక్తులు చెబుతారా



అనంతపురం: వైకాపా హయాంలో జరిగిన అరాచకాలను సరిదిద్దడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు హోం మంత్రి అనిత తెలిపారు. వైకాపా సైకో బ్యాచ్ అసత్యాలను ప్రచారం చేస్తూ.. ప్రజలను భయపెడుతుంటే.. జగన్ సూక్తులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. అనంతపురం పోలీస్ శిక్షణ కేంద్రంలో నిర్వహించిన డీఎస్పీల పాసింగ్ ఔట్ పరేడ్‌కు అనిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. పోలీసుల సంక్షేమంతోపాటు వారికి మౌలిక సదుపాయాల కల్పన దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులను సమాయత్తం చేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఏమీ జరగకపోయినా.. ఏదేదో జరిగిపోయిందని దుష్ప్రచారం చేస్తూ ప్రజలను వైకాపా సైకోలు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని విమర్శించారు. "గత ప్రభుత్వ హయాంలో జగన్ ఇంటి భద్రత కోసం రూ.12 కోట్లు ఖర్చు చేశారు. వైకాపా ఐదేళ్ల పాలనలో పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితులకు వైకాపా దుష్టపాలన పాపాలే కారణం. శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. పోలీసు వ్యవస్థను పటిష్ఠం చేస్తాం. పోలీసులకు మౌలిక సదుపాయాలను కల్పించి, సాంకేతికంగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేస్తాం" అని అనిత స్పష్టం చేశారు.

## మియాపూర్?లో భూముల అన్యాక్రాంతంపై హైడ్రా దృష్టి..




**హైదరాబాద్, :** గ్రేటర్ హైదరాబాద్ లోని అక్రమ కట్టడాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతుంది. గ్రేటర్ పరిధిలోని చెరువుల, కుంటలు, ప్రభుత్వ స్థలాలు, పార్కులు, నాలాలను కబ్జా చేసి నిర్మించి అక్రమ కట్టడాలను కూల్చేస్తుంది. గత మూడు నెలల్లోనే వందల నిర్మాణాలను నెలమట్టం చేశారు. రాజకీయ ఒత్తిళ్లకు ఏమాత్రం ఆస్కారం లేకుండా సైలెంట్‌గా పని చేసుకుంటూపోతుంది. మియాపూర్ లోని సర్వే నెంబర్ 100, 101లో గల భూముల అన్యాక్రాంతంపై హైడ్రా అధికారులు దృష్టి పెట్టారు. ఇక, మియాపూర్ లో భూముల అన్యాక్రాంతంపై విచారణ చేసేందుకు రంగంలోకి ప్రత్యేక బృందం దిగింది. భూముల వాస్తవ విస్తీర్ణం, ప్రస్తుతం ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమి సుమారు 15 ఏళ్లుగా జరిగిన రిజిస్ట్రేషన్ లావాదేవీలపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం నుంచి వివరాలను అధికారులు సేకరించారు. త్వరలో చర్యలకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. అక్రమ రిజిస్ట్రేషన్లు ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూమి ఆక్రమణ పైనే ప్రధాన దృష్టి సారించినట్లు హైడ్రా అధికారులు తెలిపారు.

## వైసీపీకి బిగ్ షాక్.. టీడీపీ గూటికి కుప్పం మున్సిపల్ ఛైర్మన్



**అమరావతి,:** ఆంధ్రప్రదేశ్‌లో సార్వత్రిక ఎన్నికలకంటే ముందు నుంచే రాజకీయ సమీకరణలు మారిపోయాయి.. ఇక, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అప్పటి వరకు అధికారంలో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి వరుసగా షాక్‌లు తగులుతూనే ఉన్నాయి.. ఇప్పటికే కొందరు సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు.. ప్రజాప్రతినిధులు, సీనియర్ నేతలు ఇలా చాలా మంది పార్టీకి గుడ్‌బై చెప్పి.. టీడీపీలో చేరారు.. మరికొందరు జనసేన కండువా కప్పుకున్నారు.. ఇంకా కొందరు కమలం పార్టీలో చేరిపోయారు.. ఇప్పుడు చిత్తూరు జిల్లా కుప్పంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన కీలక నేత, కుప్పం మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్.. తెలుగుదేశం పార్టీలో చేరారు.. వైసీపీకి గుడ్‌బై చెప్పడంతో పాటు మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేసినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు సుధీర్.. ఉండవల్లి నివాసంలో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి సుధీర్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ కండువా కప్పి సుధీర్ ను చంద్రబాబు పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీకి, మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్ పదవులకు రాజీనామా చేసిన అనంతరం సుధీర్ టీడీపీలో చేరారు. చంద్రబాబుతోనే కుప్పం సమగ్ర అభివృద్ధి సాధ్యమని తామంతా నమ్ముతున్నామని సుధీర్ అన్నారు. సీఎం చంద్రబాబుతో కలిసి నడిచేందుకే అన్ని పదవులకు రాజీనామా చేశానని ఈ సందర్భంగా వెల్లడించారు సుధీర్. కాగా, వైసీపీ ప్రభుత్వ హయాంలో కుప్పం నియోజకవర్గాన్ని టార్గెట్ చేసినట్టుగా కేంద్రీకరించారు వైఎస్ జగన్.. అయితే, మరోసారి భారీ విజయాన్ని అందుకున్న చంద్రబాబు నాయుడు.. తన నియోజకవర్గంపై ఫోకస్ పెట్టారు..

# అమెరికన్ల అగ్రతాంబూలం ఎవరికి



అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించేదెవరు? రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంపా లేక డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిసా? అమెరికన్లకే కాదు, యావత్ ప్రపంచానికీ ఉత్కంఠ గొలుపుతున్న ప్రశ్న ఇది. ఇద్దరిలో ఎవరు గెలిచినా అది చారిత్రాత్మకమే అవుతుందనడంలో సందేహం లేదు. తెంపరితనానికి మారుపేరుగా, ప్రజాస్వామ్య విలువల పట్ల ఏమాత్రం గౌరవం లేని వ్యక్తిగా పేరొందిన ట్రంప్‌కు ప్రజలు మరోసారి పట్టంగడితే అది రికార్డే. అధికారంలో ఉన్నప్పుడే కాదు, అధికారానికి దూరమైన గత నాలుగేళ్లలోనూ ట్రంప్ మూటగట్టుకున్న అపఖ్యాతి అంతా ఇంతా కాదు. ఆర్థికపరమైన కేసులతోపాటు, అక్రమ సంబంధాల విషయంలోనూ ఆయన కావలసినంత చెడ్డ పేరు సంపాదించుకున్నారు. అయినా రిపబ్లికన్ పార్టీ తరపున బరిలోకి దిగి, ప్రత్యర్థికి సమవుజ్జీగా నిలిచారంటే అందుకు ఆయన దూకుడుతనం, అమెరికాను గొప్పగా నిలబెడతానంటూ ఆయన తలకెత్తుకున్న నినాదం, జాతీయవాదం పేరిట అమెరికన్లను రెచ్చగొట్టిన విధానం కారణం. కమలా హారిస్ గెలిస్తే, అమెరికా అధ్యక్ష పీఠాన్ని అధిష్ఠించిన మొట్టమొదటి మహిళగా ఆమె చరిత్ర సృష్టిస్తారు. అతి పెద్ద ప్రజాస్వామిక దేశంగా అమెరికా వినుతికెక్కినా, స్వతంత్ర దేశంగా అవతరించాక గత రెండున్నర శతాబ్దాల చరిత్రలో ఇప్పటివరకూ ఒక్క మహిళ కూడా దేశాధ్యక్షురాలిగా ఎన్నిక కాకపోవడం విచిత్రమే. 2016 ఎన్నికల్లో హిల్లరీ క్లింటన్ అధ్యక్ష పదవికి పోటీపడినా, ఆమెపై ట్రంప్ విజయం సాధించి అధికారంలోకి వచ్చారు. శ్రీలంక, బంగ్లాదేశ్, ఇండొనేసియా, మయన్మార్, పాకిస్తాన్, ఇండియా వంటి వర్ధమాన దేశాలు ఏనాడో మహిళలకు అగ్రతాంబూలమిచ్చి గౌరవించాయి. ప్రస్తుతం ప్రపంచంలోని 21 దేశాల్లో మహిళలే మహారాణులుగా వెలుగొందుతున్నారు. అయినా అమెరికన్లు మాత్రం ఒక మహిళను అగ్రస్థానంలో కూర్చోబెట్టేందుకు ఇప్పటివరకూ ఇచ్చగించకపోవడమే విడ్డూరం. అంతెందుకు, నిన్నమొన్నటి వరకూ ఆ దేశంలో మహిళలకు ఓటు హక్కు కూడా ఉండేది కాదంటే ఆశ్చర్యం కలుగుతుంది. అమెరికా 1776 లోనే స్వతంత్ర దేశంగా అవతరించినా, మహిళలకు ఓటు హక్కు లభించింది మాత్రం దాదాపు 200 ఏళ్ల తర్వాతే. ఈసారి ఎన్నికల ప్రచారంలో ఊహించని సంఘటనలు అనేకం చోటు చేసుకున్నాయి. దూకుడుగా సాగిన ట్రంప్ ప్రసంగాలు, ఆయనపై జరిగిన హత్యాయత్నం ప్రచారపర్వాన్ని వేడెక్కించాయి. డెమొక్రాటిక్ అభ్యర్థిగా బరిలోకి దిగిన ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ అనూహ్యంగా పోటీనుంచి వైదొలగడం, ఆ స్థానంలోకి వచ్చిన కమలా హారిస్ అనతికాలంలోనే ట్రంప్‌కు సమవుజ్జీగా ఎదగడంవంటి పరిణామాలతో అధ్యక్ష ఎన్నికలు ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికాలో ప్రభుత్వం మారితే ఇండియాపై ఆ ప్రభావం ఏమేరకు ఉంటుందనే చర్చ సాగుతోంది. అమెరికాకు జలుబు చేస్తే ప్రపంచానికి జ్వరం వస్తుందనే నానుడి అతిశయోక్తిగా అనిపించినా అందులో వాస్తవం లేకపోలేదు. అంతర్జాతీయ మారకంగా అమెరికన్ డాలర్ ప్రపంచ దేశాలపై ఆధిపత్యం చెలాయిస్తోంది. తిరుగులేని ఆర్థికశక్తిగా, అద్వితీయమైన సైనిక సంపత్తితో అగ్రరాజ్యం పరోక్షంగా ప్రపంచాన్ని శాసిస్తోంది. ఈ క్రమంలో అమెరికాలో ప్రభుత్వం మారితే ఆ ప్రభావం ప్రపంచ దేశాలపై ఉండటం ఖాయం. అయితే, అగ్రరాజ్యాధినేతగా ఎవరు అధికారంలోకి వచ్చినా ఇండియాపై అంతగా ప్రభావం పడే అవకాశం ఉండకపోవచ్చు. అమెరికాకు అన్నివిధాలా ప్రధాన శత్రువుగా ఎదుగుతున్న చైనాను నిలువరించాలంటే, ఇండియాతో స్నేహం అగ్రరాజ్యానికి తప్పనిసరి. శత్రువుకి శత్రువు మనకి మిత్రుడనే నానుడి అటు అమెరికాకు, ఇటు ఇండియాకు కూడా వర్తిస్తుంది. అతి ప్రాచీన ప్రజాస్వామికదేశంగా, బలమైన ఆర్థికశక్తిగా ఎదుగుతున్న ఇండియాతో స్నేహ సంబంధాలు ఇండో పసిఫిక్ ప్రాంతంలో వ్యూహాత్మకంగా అగ్రరాజ్యానికి ఎంతో అవసరం. భారత్ అత్యధికంగా పన్నులు విధిస్తోందని అడపాదడపా రుసరుసలాడే ట్రంప్ సైతం ఈ విషయాన్ని అంగీకరించక తప్పలేదు. తాను గెలిస్తే భారత్‌తో సంబంధ బాంధవ్యాలను మరింత బలోపేతం చేసుకుంటానని ఆయన చెబుతున్నారు. హారిస్ విజయం సాధించినా ఈ వైఖరిలో మార్పు ఉండకపోవచ్చు. అగ్రరాజ్యంలో 54 లక్షలకు పైగా ఉన్న భారతీయుల్లో 61 శాతం మంది హారిస్ వైపే మొగ్గు చూపడానికి కారణం ఆమె భారతీయ మూలాలున్న వ్యక్తి కావడమే. వలసదారులపై ఉక్కుపాదం మోపి, అమెరికన్లకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ట్రంప్ కంకణం కట్టుకున్నారు. ఆయన గెలిస్తే, వలసవాద విధానాల్లో మార్పు రావచ్చు. పైగా మిత్రులకు పెద్దపీట వేసి, శత్రువులపై కక్ష తీర్చుకునే ఆయన విధానాలు ఇప్పటికే అనుభవైకవేద్యం. ఇందుకు భిన్నంగా కమలా హారిస్, తాను గెలిస్తే శత్రువులను కూడా మిత్రులుగానే పరిగణిస్తానంటున్నారు. పైపెచ్చు రిపబ్లికన్లకు తన కేబినెట్లో చోటు ఇస్తానంటున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారంనాటి ఎన్నికల్లో అమెరికన్లు ఎవరికి పట్టం కడతారనేది ఉత్కంఠగా మారింది.

# సేవ్ కప్పట్రాళ్ల




కర్నూలు జిల్లా కప్పట్రాళ్ల అటవీ ప్రాంతంలో ప్రమాదకర యురేనియం తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా అనుమతులివ్వడం నిరంకుశ పోకడకు అద్దంపడుతుంది. తమ బతుకులను ఛిద్రం చేసే యురేనియం మైనింగ్ వద్దే వద్దంటూ కప్పట్రాళ్ల పరిసర గ్రామాల ప్రజానీకం పలు విధాలుగా వ్యతిరేకత తెలియజేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెవికెక్కించుకోలేదు. గత్యంతరం లేక 12 గ్రామాల ప్రజలు శుక్రవారం పార్టీలకతీతంగా సమావేశమై యురేనియం తవ్వకాల వ్యతిరేక పోరాటాన్ని ముందుకు తీసుకుపోయేందుకు జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి)గా ఏర్పడ్డారంటే ఆ ప్రాంత వాసులు యురేనియం మైనింగ్ పట్ల ఎంతగా బెంబేలెత్తుతున్నారో అర్థమవుతుంది. జెఎసి పిలుపు మేరకు శనివారం నాడూ గ్రామాల ప్రజలు కదిలొచ్చి రాస్తారోకోలు, ధర్నాలు నిర్వహించారు. మైనింగ్‌ను ఆపించలేని రాష్ట్ర ప్రభుత్వం, ఆందోళనలో పాల్గొనకుండా ప్రజలను, స్వచ్ఛంద సంస్థల, ప్రజాసంఘాల, వివిధ పార్టీల నేతల కట్టడికి యత్నించింది. విపక్షాలతో పాటు అధికార టిడిపి నాయకులను సైతం పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. నిర్బంధాలను, బెదిరింపులను ప్రజలు లెక్క చేయలేదు సరికదా తవ్వకాలు ఆపే వరకు ఉద్యమిస్తామని ప్రతినబూనడం హర్షణీయం. వారి ఏకైక నినాదం 'సేవ్ కప్పట్రాళ్ల'. రాయలసీమలో యురేనియం నిక్షేపాలున్నాయని దశాబ్దాల కిందటనే ఆటమిక్ మినరల్స్ డైరెక్టరేట్ ఫర్ ఎక్స్‌ప్లోరేషన్ అండ్ రిసెర్చ్ (ఎఎండి) ప్రాథమిక అంచనాకొచ్చింది. కడప జిల్లా తుమ్మలపల్లెలో 2007 ప్రాంతంలో తవ్వకాలకు అంకురార్పణ జరిగింది. అక్కడి ప్రజలు మైనింగ్‌ను వ్యతిరేకిస్తూనే ఉన్నారు. పర్యావరణం, నీటి వనరులు కలుషితమవుతున్నాయని నెత్తీనోరు బాదుకుంటున్నారు. కడప బేసిన్‌కు సబ్ బేసిన్ కప్పట్రాళ్ల. అక్కడ 2017 లోనే పరిశోధనల కోసం తొమ్మిది బోర్లను డ్రిల్లింగ్ చేసి యురేనియం నిక్షేపాలున్నట్లు గుర్తించారు. మరిన్ని పరిశోధనలు, నిర్ధారణల కోసం రిజర్వ్ ఫారెస్ట్‌లో పలు చోట్ల 68 బోర్ల తవ్వకాలకు ఎఎండి ప్రతిపాదించగా కేంద్రం అనుమతులిచ్చింది. గత నెలలో నోటిఫికేషన్ జారీ అయింది. ఇదంతా టిడిపి, వైసిపి, ఇప్పుడు టిడిపి ప్రభుత్వాల హయాంలోనే చోటు చేసుకుంది. కేంద్రంలో ఉన్నది బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం. యురేనియం తవ్వకాల వలన కప్పట్రాళ్ల ప్రాంతంలోని 1,200 ఎకరాల అటవీ భూమి, పచ్చని పంట పొలాలు, తోటలు ధ్వంసం అవుతాయని, హంద్రీ-నీవా సహా అన్ని నీటి వనరులు కాలుష్యమవుతాయని, తాము తీవ్ర అనారోగ్యం పాలవుతామని, భవిష్యత్ తరాలకు ముప్పు అనే జనం భయాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద సరైన సమాధానం లేదు. యురేనియాన్ని అణు ఇంధన ఉత్పత్తికి, ఐసోటోపులు, మెడికల్, ఇండస్ట్రియల్, డిఫెన్స్ కోసం ప్రపంచ వ్యాప్తంగా వినియోగిస్తున్నారు. ప్రమాదమనే యురేనియం తవ్వకాలను, న్యూక్లియర్ పవర్ ప్రాజెక్టులను అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలు తగ్గించాయి. భారత్ వంటి దేశాలకు తరలిస్తున్నాయి. అమెరికా ఒత్తిడితో మన కేంద్ర ప్రభుత్వం ప్రమాదమని, అధిక ఖర్చని తెలిసినా ఆ వైపు చూస్తోంది. బిజెపి సర్కారుకు మైనింగ్ విషయంలో ప్రజలు పట్టట్లేదు. కార్పొరేట్ల లాభాలే పరమావధిగా పని చేస్తోంది. దండకారణ్యం, ఇతర అటవీ ప్రాంతాల్లో గిరిజనుల హక్కులపైనా, రాజ్యాంగం వారికి కల్పించిన హక్కులు, చట్టాలపై ఏ విధంగా దాడులు జరుగుతున్నాయో చూస్తున్నాం. విశాఖ మన్యంలో బాక్సైట్ అయినా, కప్పట్రాళ్లలో యురేనియం అయినా ప్రజలు, వారి అభిప్రాయంతో పని లేదు. రాష్ట్రంలో టిడిపి కూటమి అధికారంలో ఉంది. కేంద్ర ప్రభుత్వంలో టిడిపి భాగస్వామిగా ఉంది. కప్పట్రాళ్లలో తవ్వకాలు జరపాలంటే కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వం, ఇక్కడి అటవీశాఖ సహకారం తప్పనిసరి. కూటమి సర్కారు కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి యురేనియం తవ్వకాల అనుమతులను రద్దు చేయించాలి. ప్రజాభీష్టాన్ని గౌరవించాలి.

# ఆత్మపరిశీలన అవసరం!




సొంతగడ్డపై చిరకాలంగా భారత క్రికెట్ జట్టు అజేయమైనదనే రికార్డు కుప్పకూలింది. భారత పర్యటనకు వచ్చిన న్యూజిలాండ్ చేతిలో మనవాళ్ళు మొత్తం 3 టెస్టుల్లోనూ ఓటమి పాలయ్యారు. స్వదేశంలో టెస్ట్‌సిరీస్‌ను ఇలా 0-3 తేడాతో చేజార్చుకోవడం భారత క్రికెట్‌చరిత్రలో ఇదే ప్రథమం. కాగా, ఈ సిరీస్ పరాభవంతో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ర్యాంకింగుల్లో భారత్ అగ్రస్థానం ఆస్ట్రేలియాకు కోల్పోయి, ద్వితీయ స్థానానికి పడిపోయింది. ఆటలో గెలుపోటములు సహజమైనా, ఈ స్థాయి పరాజయం భారత జట్టు అత్యవసరంగా ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది. టీ20ల మోజులో పడి టెస్ట్ క్రికెట్‌కు అవసరమైన కనీసపాటి సన్నద్ధత అయినా లేకుండానే బరిలోకి దిగిన మన ఆటగాళ్ళ నిర్లక్ష్యాన్ని నిలదీస్తోంది. ఆఖరుసారిగా 2012లో ఇంగ్లండ్‌కు చెందిన అలస్టయిర్ కుక్ చేతిలో ధోనీ సేన 2-1 తేడాతో టెస్ట్ సిరీస్‌లో ఓటమి పాలైన తర్వాత గత పుష్కరకాలంగా భారత క్రికెట్ జట్టు స్వదేశంలో ఎన్నడూ మళ్ళీ సిరీస్‌ను కోల్పోలేదు. భారత జట్టు సారథులు మారుతూ వచ్చినా, 18 టెస్ట్ సిరీస్‌లలో విజయం మనదే. కివీస్‌పైనా ఆ ట్రాక్ రికార్డ్ కొనసాగుతుందని అందరూ భావించిన నేపథ్యంలో ఇది ఊహించని ఎదురుదెబ్బ. గత నెలలో బెంగుళూరులో 8 వికెట్ల తేడాతో తొలి టెస్ట్, ఆ వెంటనే పుణేలో 113 పరుగుల తేడాతో మలి టెస్ట్ ఓడిపోయినప్పుడే సిరీస్ చేజారింది. అయితే, ముంబయ్‌లో జరుగుతున్న ఆఖరి టెస్ట్‌లోనైనా గెలిచి, భారత జట్టు పరువు నిలుపుకొంటుందని ఆశించారు. చివరకు ఆ ఆశను కూడా వమ్ము చేసి, కివీస్ ముందు మన ఆటగాళ్ళు చేతులెత్తేయడం ఇప్పుడిప్పుడే మర్చిపోలేని ఘోర పరాభవం. ముంబయ్‌లో 147 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సైతం ఛేదించలేక ఆదివారం భారత జట్టు 121 పరుగులకే ఆలౌట్ అవడంతో, అవమానకరమైన రీతిలో 0-3 తేడాతో సిరీస్‌ను పోగొట్టుకోవాల్సి వచ్చింది. కచ్చితంగా ఇది భారత జట్టుకు మేలుకొలుపు. భారత జట్టు వ్యూహరచన లోపాలు కొల్లలు. కివీస్‌తో బెంగుళూరు టెస్ట్‌లో టాస్ గెలిచాక మన వాళ్ళు మొదట బ్యాటింగ్ ఎంచుకోవడం అలాంటిదే. బ్యాట్స్‌మన్ల ఆర్డర్‌లో అనూహ్య ప్రయోగాల సంగతీ అంతే. ఇక, అవసరం లేకున్నా పుణేలో బంతి సుడులు తిరిగేలా పిచ్ రూపొందించారు. అదీ ప్రత్యర్థి జట్టుకే లాభించింది.

కాబట్టి, భారత జట్టులోని మేధాబృందం ఆగి, ఆలోచించాలి. సిరీస్‌కు ముందు దులీప్ ట్రోఫీలో ఆడాలని చెప్పినా, మరిన్ని వసతుల కోసం అనంతపురం నుంచి బెంగు ళూరుకు వేదిక మార్చినా అగ్రశ్రేణి ఆటగాళ్ళు ముందుకు రాకపోవడం ఘోరం. వారిని అందుకు అనుమతించడం ఒక రకంగా క్రికెట్ బోర్డ్ స్వయంకృతాపరాధమే. దాని పర్యవసానం, సిరీస్ భవిత తొలి టెస్ట్, తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగుల అత్యల్పస్కోర్‌కి భారత్ అవుటైనప్పుడే అర్థమైపోయింది. స్పిన్ ఆడడంలో భారత ఆటగాళ్ళు దిట్టలని ప్రతీతి. కానీ, అదంతా గతం. ఇప్పుడు పరిస్థితి మారింది. జట్టులో బెస్ట్ బ్యాట్స్‌మెన్ అయిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు ఇద్దరూ లెఫ్ట్ ఆర్మ్ స్పిన్‌లో తరచూ ఔటవుతున్నారనీ, 2021 - 2024 మధ్య సొంత గడ్డపైన స్పిన్ బౌలింగ్‌లో సాధించిన సగటు పరుగులు 30 మాత్రమేననీ విశ్లేషకులు లెక్కలు తీశారు. అసాధారణ స్పిన్నర్లు కాకున్నా, కివీస్ బౌలర్ల చేతుల్లో భారత ఆటగాళ్ళు టకటకా ఔటవడం చూస్తే, స్పిన్‌లో మనం మాస్టర్లం కాదని తాజా సిరీస్ ఎత్తిచూపినట్టయింది. అలాగే, ఎర్ర బంతితో ఆడే టెస్ట్‌లకూ, తెల్ల బంతితో నడిచే టీ20 లకూ మధ్య చాలా తేడా ఉందని ఆటగాళ్ళు గ్రహించాలి. అన్ని బంతులూ ఆడి తీరాలి, పరుగులు చేయాలనే టీ20ల ధోరణితోనే టెస్ట్‌లు ఆడితే చిక్కులు తప్పవు. 2021లో టెస్ట్ ఓపెనర్‌గా ఇంగ్లండ్‌లో సక్సెస్ సాధించిన రోహిత్ మార్చుకున్న టీ20 ధోరణితోనే కివీస్‌పై ఆడడం వల్ల ఇబ్బంది పడ్డారు. కెప్టెన్‌గా ఆయనే పరుగులు చేయకపోతే, జట్టు పైన, ఆయన సారథ్యంపైన ఒత్తిడి తప్పదు. గతంలో 2011-12 ఆస్ట్రేలియా పర్యటన భారత జట్టు నుంచి ద్రావిడ్, లక్ష్మణ్‌ల రిటైర్మెంట్‌కు దారి తీసింది. చరిత్ర పునరావృతమై, ఇప్పుడు రానున్న టూర్ కోహ్లీ, రోహిత్‌లకు చివరిది అవుతుందా? చెప్పలేం. అనూహ్యంగా వారిద్దరూ విఫలమైన కివీస్ సిరీస్ పరిస్థితే ఆస్ట్రేలియా టూర్ లోనూ ఎదురైతే, సీనియర్లు రిటైర్ కావాలంటూ ఒత్తిడి పెరుగుతుంది. ఇక, వచ్చే వరల్డ్ టెస్ట్ ఛాంపి యన్ షిప్ విషయానికొస్తే, కివీస్ సిరీస్ దెబ్బతో వరల్డ్ టెస్ట్ ర్యాకింగుల్లో మన స్థానం పడిపోయినందున భారత్ ఫైనల్‌కు చేరడం కష్టమే. ఇంకా చెప్పాలంటే, ఆస్ట్రేలియాను దాని సొంత గడ్డపై 4-0 తేడాతో ఓడిస్తే కానీ, మన ఫైనల్ ఆశ పండదు. ఏ రకంగా చూసినా అసాధ్యమే. ఈ పరిస్థితుల్లో ఆస్ట్రేలియా టూర్‌లోనైనా మన జట్టు మితిమీరిన ఆలోచనలు, అంచనాలు పక్కనబెట్టి కేవలం ఆడు తున్న టెస్టులపై ఒకదాని వెంట మరొకటిగా దృష్టి పెడితే మేలు. పరిస్థితులు, పిచ్ స్వభావాన్ని బట్టి అప్పటికప్పుడు ఆట తీరును మలుచుకోవాలే తప్ప, ముందుగానే ఓ నిర్ణయానికి వచ్చి దూకుడు చూపుదామనుకుంటే చిక్కే, మారకపోతే మళ్ళీ కివీస్‌తో సిరీస్‌లో లాగా బోర్లా పడక తప్పదు. నిజానికి, భారత్ ఇప్పటికీ మంచి జట్టే. ఆటగాళ్ళలో ప్రతిభకు కొదవ లేదు. అయితే, టాలెంట్ ఎంత ఉన్నా ఆటలో టెంపర్‌మెంట్ ముఖ్యం. వాటికి తోడు కింద పడినా మళ్ళీ పైకి లేచి సత్తా చాటే చేవ కీలకం. మన జట్టు ఇప్పుడు వీటిని ప్రదర్శించాలి. అందుకోసం తాజా సిరీస్ ఓటమికి కారణాలను ఆత్మపరిశీలన చేసుకోవాలి. భారత క్రికెట్ చరిత్రలో ఎన్నడూ లేనట్లుగా 3-0 తేడాతో సిరీస్‌ను కోల్పోయి, ఈ అధఃపాతాళానికి ఎలా పడిపోయామో స్వీయ విశ్లేషణ జరుపుకోవాలి. టీ20 వరల్డ్ కప్‌లో విజేతగా నిలిచిన ఆనందాన్ని మర్చిపోక ముందే ఈ పరాజయాన్ని ఎలా కోరి కొని తెచ్చుకున్నామో విశ్లేషించుకోవాలి. ఎంతైనా, పరాజయాలే విజయాలకు మొదటి మెట్టు కదా!